


జనవరి 10 నుంచీ సూళ్లూరుపేట కేంద్రంగా నిర్వహణ

మూడు రోజుల పాటు ఐదు వేదికల మీద కార్యక్రమాలు

ఆంధ్రజ్యోతితో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

# మళ్లీ పక్షుల పండుగ కళ

జగన్ ప్రభుత్వం దాపచుట్టేసిన అనేకంలో ఫ్లెమింగో ఫెస్టివల్ ఒకటి. సూళ్లూరుపేట కేంద్రంగా వైభవంగా జరిగే ఈ పక్షుల పండుగ సంప్రదాయానికి తిలోదకాలు ఇచ్చేశారు. నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ ఈ ప్రాంతానికి పండుగ కళ వస్తోంది. నేలపట్టు చెరువులో గూడబాతుల వయ్యారపు ఈత విన్యాసాలనూ, కర్రవల్ల ప్రేమ సందేశాలనూ, పిల్ల పిట్టల నోటికి అందించే చేపలనూ.. పులికాట్ సరస్సులో ఫ్లెమింగో కొంగల చేపల వేటనూ, ఆకాశమంతా రెక్కలు విప్పుకుని ఎగిరే రకరకాల వలస పిట్టలనూ వీక్షించేందుకు అనువైన సమయం ఇది. ఈ నేపథ్యంగా నిర్వహిస్తున్న పక్షుల పండుగ విశేషాలను ఆంధ్రజ్యోతితో ప్రత్యేక సంభాషణలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం వివరించారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

### జనవరి 10 నుంచి..

అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ ఏడాది ఫ్లెమింగో ఫెస్టివల్‌ను రాష్ట్ర పండుగగా నిర్వహించబోతున్నాం. ఈ సంబరాలను రూ.8కోట్ల వ్యయంతో నిర్వహిస్తున్నాం. సూళ్లూరుపేట కేంద్రంగా జనవరి 10, 11, 12 తేదీల్లో మూడు రోజుల పాటు వేడుకలు జరుగుతాయి.

### సీఎంకు, పవన్‌కు ఆహ్వానం

నాలుగేళ్ల తర్వాత జరుగుతున్న ఈ పక్షుల పండుగకు ముఖ్యఅతిథులుగా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లతో పాటు, మంత్రులు, జిల్లా ప్రజాప్రతినిధులను ఆహ్వానించాం. స్థానికులను భాగస్వాములను చేసుకుని పండుగ నిర్వహిస్తాం.

### పక్షుల వీక్షణకు ఏర్పాట్లు

ఈ సీజన్‌లో 200రకాల పక్షులు 4లక్షల దాకా ఇక్కడికి వస్తుంటాయి. అయితే ఫ్లెమింగో ఫెస్టివల్ నాటికి 18 రకాల పక్షులు 20 వేల దాకా విదేశాల నుంచి వలస వస్తాయి. ఈ పక్షులను వీక్షించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ అనే ప్రఖ్యాత ఎన్జీవో భాగస్వామ్యంతో ఈ ఏర్పాటు చేశాం. శ్రీసిటీ ప్రతినిధులను కూడా అనుసంధానం చేస్తున్నాం. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో పక్షుల పండుగ జరుగుతుంది. పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందితే యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి.



### ఐదు వేదికలుగా పండుగ

ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఐదు వేదికల మీద నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా నేలపట్టులో పక్షుల సందర్శన, స్నేక్‌షో, డాగ్‌షో, వైల్డ్ లైఫ్ ఫొటో ప్రదర్శన ఉంటాయి. షార్ రోడ్డులోని అటకానితిప్పలో పక్షుల సందర్శన, ఫిలింషోలు ఉంటాయి. బీవీపాళెం వద్ద పులికాట్ సరస్సులో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేశాం. ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభోత్సవం, ముగింపు కార్యక్రమాలు సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తాం. ఇక్కడ అనేక స్టాల్స్ ఉంటాయి. అందులో చేనేత, కలంకారీ, హస్తకళల సందర్శనతో పాటు తిరుపతి జిల్లా వంటకాలకు సంబంధించి పర్యాటకులకు ప్రత్యేక ఫుడ్‌స్టాళ్లను ఏర్పాటు చేస్తాం.ఈ ప్రాంగణంలో ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి కళాప్రదర్శన నిర్వహిస్తున్నాం. ఐదవ వేదికగా శ్రీసిటీని ఎంపిక చేశాం. పర్యావరణ పరిరక్షణ- పారిశ్రామికవేత్తల సామాజిక బాధ్యతగా ఏకోటూరిజంపై సదస్సులు నిర్వహిస్తున్నాం.



# గంటలోనే దర్శనం

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడితో ఇంటర్వ్యూ...

- తిరుమల ప్రక్షాళన మొదలైంది.
- ఆ చెత్త కాంట్రాక్టు రద్దు చేస్తాం
- భక్తులతో బూతులు మాట్లాడితే ఊరుకోం
- అన్యమత ఉద్యోగులను జమ్మూకి పంపుతాం

'గంటలకు గంటలు క్యూలైన్లలో నిలబడి ఉండాల్సిన అవసరం లేదు. ముఖ ఆధారిత గుర్తింపు వ్యవస్థ అందుబాటులోకి తీసుకువస్తే కేవలం గంటలోనే భక్తులకు శ్రీవారి దర్శనం సాధ్యమవుతుంది. ఈ సాంకేతికతను ఉచితంగా అందివ్వడానికి సంస్థలు ముందుకు వస్తున్నాయి. రెండు మూడు నెలల్లోనే ఇది అమలవుతుంది'

నెలన్నరపాటు నిశిత పరిశీలన తర్వాత టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ధీమాగా చెప్పిన మాట ఇది. జగన్ జమానాలో అవినీతి చర్యలు, అర్థంపర్థం లేని వ్యయాలు, దర్శనాల దందాలు, అనాలోచిత నిర్ణయాలు.. తిరుమల కొండను కొల్లగొట్టే దిశగా సాగాయనే ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో పెనుమూరు బిడ్డ బీఆర్ నాయుడు టీటీడీ బాధ్యతలు స్వీకరించారు. చంద్రబాబు ఆకాంక్షకు అనుగుణంగా తిరుమల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. కొత్త చైర్మన్‌గా ఆయన పరిశీలనలు.. చేయాలనుకుంటున్న మార్పుల గురించి ఆంధ్రజ్యోతితో సంభాషణలో వెల్లడించారు.

- ఆ విశేషాలు.. 8లో -



# కందిపప్పో..!

- వచ్చిందే తక్కువ.. అదీ అయిపోయింది
- కార్డుదారులకు పలువురు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల సమాధానమిది

జిల్లాలో రేషన్ షాపులకు చేరిన కోటా మేరకు కందిపప్పును కార్డుదారులకు సక్రమంగా ఇవ్వడంలేదన్న ఆరోపణలున్నాయి. 600 టన్నులు అవసరం కాగా.. 350 టన్నులే వచ్చిందంటూ కొందరు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు చేతివాటం చూపుతున్నారన్న విమర్శలున్నాయి. ఎందుకంటే.. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.190 నుంచి 220 వరకు పలుకుతోంది. ఇందులో రకాలను బట్టి ధరలున్నాయి. అదే ప్రభుత్వం రాయితీపై కిలో రూ.67కే రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తోంది. దీంతో కొందరు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కలిసి తమకు వచ్చిన కోటాలో సగం మాత్రమే కార్డుదారులకు ఇచ్చి.. ఆ తర్వాత అయిపోయిందని చెబుతున్నట్లు తెలిసింది. బియ్యం ఇస్తున్న సమయంలోనే కందిపప్పు, చక్కెర ఇస్తున్నట్లు కూడా వేలిముద్రలు వేయించుకుంటున్నారు. దీంతో అసలు కందిపప్పు ఎంత ఇచ్చారనేది తెలియని పరిస్థితి. కాగా, పలువురు కార్డుదారులకు ఇవ్వకుండా ఆన్‌లైన్‌లో ఇచ్చినట్లు చూపే కందిపప్పును.. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.140 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

రేషన్ దుకాణాలు: 1457
బియ్యం కార్డులు: 6,00,350
కిలో లెక్కన కావాల్సింది: 600.35 టన్నులు
కేటాయించింది: 350 టన్నులు

ఈ లెక్కన దాదాపు 62 శాతం మందికే కందిపప్పు వచ్చినట్లు. ఈ తేడాను కొందరు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. 'కొంచెమే వచ్చింది. కోటా అయిపోయింది' అని చెబుతున్నారన్న విమర్శలున్నాయి. ఇలా ఎందుకు జరుగుతోందో చూస్తే..

### రశీదులిస్తే కొంత పరిష్కారం

నిత్యావసర వస్తువులు పంపిణీ చేసే సమయంలో ఈ పోస్ మిషన్‌లో కార్డుదారుల బయోమెట్రిక్ తీసుకోవాలి. ఏయే సరుకులు తీసుకున్నారో తెలిసేలా రశీదులివ్వాలి. కానీ ఎక్కడా ఇచ్చిన దాఖలాల్లేవు. ఒకవేళ కార్డుదారుడు కందిపప్పు, చక్కెర వద్దనుకుంటే సదరు డీలరు, ఎండీయూ ఆపరేటర్ మిగిలిన మొత్తాన్ని వచ్చే నెలకు సర్దుబాటు చేయాలి. ఇలా ఎక్కడా జరుగుతున్న ఆనవాళ్లు లేవు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

### విచారించి చర్యలు తీసుకుంటాం

జిల్లాలో కోస్టల్ ప్రాంతాల్లో చాలా చోట్ల కందిపప్పు తీసుకోవడం లేదు. దీంతో డీలర్లు వారి దుకాణాలకు ఎంత అవసరమో అంతే డీడీలు కట్టారు. వారి డిమాండు మేరకు సరఫరా చేశారు. కార్డుదారులకు కచ్చితంగా కిలో కందిపప్పు, కిలో చక్కెర ఇవ్వాలి. ఇందులో ఎలాంటి దాపరికం లేదు. ఎక్కడైనా ఇవ్వకుంటే వెంటనే మాకు ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం. ఎక్కడెక్కడ పంపిణీ చేయలేదో విచారించి స్టాకు, అమ్మకం రిజిస్టర్లు పరిశీలిస్తాం.

- డీఎస్‌వో శేషాచలం రాజు

# ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాల కొనసాగింపు

- జిల్లాలో 199 మసీదుల ప్రతినిధులకు లబ్ధి

తిరుపతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదాయం లేని మసీదుల ఇమామ్‌లకు, మౌజన్లకు చెల్లించే గౌరవ వేతనాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కూడా పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ.. దేశంలోనే తొలిసారిగా ఈ గౌరవ వేతనం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వం ఈ ఏడాది మార్చి వరకే ఈ పథకాన్ని అమలు చేసింది. ఆ తర్వాత బడ్జెట్ కేటాయించలేదు. తాజాగా దీనిపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం ఇమామ్‌లకు నెలకు రూ. 10 వేలు, మౌజన్లకు నెలకు రూ. 5 వేలు చొప్పున గౌరవ వేతనాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కూడా వర్తింపజేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొనసాగింపు ఏప్రిల్ నుంచీ వర్తిస్తుందని పేర్కొంది. జిల్లాలో ఆదాయం లేని మసీదులు 199 ఉండగా.. వాటి ఇమామ్‌లు, మౌజన్లకు నెలకు రూ.29.85 లక్షల చొప్పున గౌరవ వేతనం అందనుంది. పెండింగులోని తొమ్మిది నెలల కాలానికి గానూ మొత్తం రూ.2.68 కోట్లు త్వరలో విడుదల కానున్నాయి.

## వేరుశనగ, మామిడి పంట బీమా గడువు పెంపు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈఏడాది రబీలో మామిడి, వేరుశనగ పంటలకు బీమా చెల్లింపు గడువు పెంచినట్లు జిల్లా వ్యవసాయాధికారి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో ఈనెల 15 వరకు గడువు ఉండేది. వేరుశనగ పంటకు ఎకరాకు రూ.30వేలు బీమా కాగా రైతులు రూ.450 ప్రీమియం చెల్లించాలన్నారు. ఎకరా మామిడికి బీమా రూ.35వేలు కాగా రైతులు రూ.1,750 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, కౌలు రైతులైతే సీసీఆర్‌సీ పత్రం, రైతు సేవా కేంద్రం జారీ చేసే ధ్రువీకరణ పత్రం, రైతు డిక్లరేషన్, మొబైల్ నెంబరు, రైతు బ్యాంకు ఖాతా మొదటి పేజీ కాపీలను సమీపంలోని సీఎస్‌సీ సెంటర్‌కు తీసుకువెళ్తే వివరాలను నమోదు చేస్తారన్నారు. లేకుంటే నేరుగా ఎన్‌సీఐపీ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు.


కుక్క కాటుకు గురై చికిత్స పొందుతున్న బాధితులు

## పిచ్చికుక్క వీరంగం

పుత్తూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పుత్తూరులో పిచ్చికుక్క దాడిలో పలువురు గాయపడ్డారు. గురువారం అంబేడ్కర్ కూడలిలో ఓ పిచ్చికుక్క హఠాత్తుగా పాదచారులపై దాడికి దిగింది. దాదాపు పది మంది గాయపడ్డారు. దారిన వెళ్లే వారందరిపై దాడి చేస్తూ సాగింది. మామిడికాయల మండీ వద్ద స్థానికులు దాన్ని కొట్టి చంపేశారు. కాగా పిచ్చికుక్క బాధితులు కొందరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. యాంటీ రేబిస్ మందులు ఉండడంతో కుక్క కాటుకు గురైన వారికి ఆస్పత్రిలో చికిత్సలు అందజేశారు. కాగా పట్టణంలో కుక్కలతో పాటు పాముల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవలే ప్రైవేటు విద్యా సంస్థలు ఉన్న ప్రాంతంలో ఓ విద్యార్థి తల్లి పాముకాటుకు గురై మరణించింది. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలతో పాటు పాముల బెడదను తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

## సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జుల పదవీకాలం పొడిగింపు

తిరుపతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింగిల్ విండోల పర్సన్ ఇన్‌చార్జుల పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే కొనసాగుతున్న అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జుల పదవీ కాలం ఈనెల 20వ తేదీతో ముగియనుంది. దీంతో 21వ తేదీ నుంచీ ఆరు నెలల పాటు వారి పదవీకాలాన్ని పొగిడించింది.

# ఈ గుంతలేంటి గోవిందా..!


హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపై కనిపిస్తున్న భారీ గుంతలు

నిత్యం పరిశుభ్రంగా, పటిష్ఠంగా కనిపించే తిరుమల ఘాట్ రోడ్లు ఇప్పుడు గుంతలతో దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మొదటి, రెండవ ఘాట్లతో పాటు తిరుమలలోని రోడ్లపై కూడా గుంతలేర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. చిన్నపాటి మరమ్మతులు చేపడుతున్నా నాణ్యత లేకపోవడంతో చిన్న గుంతలు కూడా పెద్దవిగా మారిపోతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేలకోట్ల రూపాయల బడ్జెట్ కలిగిన టీటీడీలో రోడ్ల నిర్వహణ దారుణంగా ఉందేంటనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు వీటిపై దృష్టిసారించాల్సిన అవసరముంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


రెండవ ఘాట్ చివరి మలుపు వద్ద రోడ్డు దుస్థితి


మొదటి ఘాట్‌లో మరమ్మతులు చేసినా గుంత పక్కనే ఏర్పడిన మరో రెండు గుంతలు

## నేటి నుంచి ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం నుంచి ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. శుక్రవారం, ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఉదయం 8.30నుంచి 9.15 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి 2.15 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను లోనికి అనుమతిస్తామని తెలిపారు. తిరుపతి జూపార్కు రోడ్డులోని అయాన్ డిజిటల్, రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల, కోట మండలంలో ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించనున్న ఈ పరీక్షకు 671మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో డీపీవో సుశీలాదేవి పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం కూడా రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. గురువారం 47 గ్రామసభలు నిర్వహించగా.. 686 అర్జీలు వచ్చాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. తొట్టంబేడు మండలం విరుపాక్షిపురంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ హాజరయ్యారు.

## నా హీరో చంద్రబాబు



- లోకేశ్ నన్ను హిట్లర్ అంటాడు
- ఒకవైపే చూడు.. బాలయ్య డైలాగుతో ఆకట్టుకున్న నారా భువనేశ్వరి

- 8లో

## విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకించండి

### జేఏసీ నాయకుల పిలుపు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలని విద్యుత్ జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట గురువారం విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఎల్.చలపతి, వి.గోపి, ఆర్.మురళీధర్, నాగరాజు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయన్నారు. కార్పొరేషన్లుగా విడగొట్టి కార్పొరేటర్లకు అప్పగించడానికి ప్రయత్నిస్తోందన్నారు. విద్యుత్ సంస్థలు ప్రైవేట్ పరమైతే ప్రజలకు రాయితీలు ఉండవన్నారు. పాలకుల కుతంత్రాలను ఉద్యోగులు, ప్రజలు కలిసికట్టుగా ఎదుర్కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ప్రసాద్ రెడ్డి, వంశీ, గోపి, అభినయ్, కార్తీక్, బ్రహ్మానందరెడ్డి, గుణశేఖర్, శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.


విద్యుత్ సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

## నడవలూరులో జ్వర బాధితులకు వైద్యసేవలు

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన ● గ్రామంలో పర్యటించిన డీపీఓ



పారిశుధ్యపనులను పరిశీలిస్తున్న సుశీలాదేవి

రామచంద్రాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో పంచాయతీ అధికారులు విధిగా డ్రైడే నిర్వహించి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి సూచించారు. నడవలూరులో డెంగీ జ్వరాలతో బాధపడుతున్నారని ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. గురువారం గ్రామంలో పర్యటించారు. పరిసరాలను శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శి సుమలతను ఆదేశించారు. జ్వర బాధితులను డీపీవో పరామర్శించారు. అంతకుముందు డివిజనల్ పంచాయతీ అధికారి సురేష్‌నాయుడు కూడా గ్రామంలో పరిసరాలను పరిశీలించారు. కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు జావిద్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. డెంగీ అదుపు చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కొందరికి చికెన్‌గున్యా వ్యాధి సోకినట్లు వైద్యులు అనుమానం వ్యక్తం చేయడంతో డీపీవో వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరితో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితి వివరించారు. బాధితుల రక్తనమూనాలు సేకరించి స్విమ్స్ ల్యాబ్‌కు పంపించాలని కమ్మపల్లి వైద్యాధికారిని ఆదేశించారు. గ్రామంలో 32మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో ఇందిరమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పవన్‌రాజు, సర్పంచ్ గణపతిరెడ్డి, ఇన్‌ఛార్జి ఈవో పీఆర్డీ చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు జనార్దన్ చౌదరి, సాయిప్రసాద్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలని ర్యాలీ



రామచంద్రాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టడానికి అందరు కలిసి రావాలని హెచ్ స్వజనకుమారి కోరారు. కుప్పం బాదూరు ఉన్నత పాఠశాల రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో జెండర్ అథారిటీ హింసకు వ్యతిరేకంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌వైఎస్ఎస్ టీం లీడర్ విమల మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పంటల ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యం బాగుటుందన్నారు. వీలైనంత వరకు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## మృతి చెందిన సభ్యులకు టీడీపీ ఆర్థిక సహాయం



మట్టి ఖర్చులకు నగదు అందజేస్తున్న టీడీపీ నేతలు

చంద్రగిరి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం సభ్యత్వం పొంది మృతి చెందిన కార్యకర్తల కుటుంబానికి పార్టీ భరోసా కల్పిస్తోంది. రామిరెడ్డిపల్లె పంచాయతీలో కూచువారిపల్లెలో సభ్యత్వం పొందిన కార్యకర్త రాజెమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబానికి మట్టి ఖర్చులకు పార్టీ గురువారం రూ.10 వేలు అందజేసింది. నాగయ్యగారిపల్లె హరిజనవాడలో మృతి చెందిన మేకల సిద్దమ్మ, బాలసుబ్రమణ్యంల కుటుంబాలకు రూ.5 వేల వంతున ఆర్థిక సాయం అందజేసింది. మృతుల కుటుంబాలకు టీడీపీ నాయకులు ఈమేరకు సాయాన్ని అందజేసారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్దయ్య, మురళి, వాసు, మేఘవర్ణంనాయుడు, సునీల్, భాస్కర్‌నాయుడు, హరినాయుడు, సుబ్రమణ్యంయాదవ్, బాలాజీ, మధుసుధన్, వసంత్, పాల్గొన్నారు.

## ఎగుడు దిగుడు వీధిలో ఎన్ని కష్టాలో..



కాలిబాటగా మారిన మచ్చావీధి

పాకాల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాకాల పంచాయతీ మచ్చావీధిలో మురుగు కాలువ పూడిక తీయడానికి ఆరు నెలల క్రితం బండలను తొలగించారు. అసలే ఇరుకుగా వున్న వీధి కాస్తా ఇప్పుడు కాలిబాటగా తయారయింది. ప్రజలు ఇండ్లకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. ఆటో కూడా వెళ్లడంలేదు. పట్టణం నడిబొడ్డున వున్న ఈ వీధిలో సిమెంటు రోడ్డు వేసి మురుగు కాలువ నిర్మించాలని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారు. పలుసార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినా పరిష్కారానికి నోచుకోలేదని వాపోతున్నారు. పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి లావణ్యలత మాట్లాడుతూ సిమెంటు రోడ్డు, మురుగు కాలువ మంజూరయిందన్నారు. త్వరలో పనులు మొదలవుతాయన్నారు.

## సుస్థిర అభివృద్ధిపై ముగిసిన శిక్షణా తరగతులు



శిక్షణ పొందిన సర్పంచులు, సచివాలయ సిబ్బంది

రామచంద్రాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలలో సుస్థిర అభివృద్ధి కోసం కలిసికట్టుగా ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దామని ఎంపీడీవో ఇందిర అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు రాష్ట్రీ గ్రామ స్వరాజ్ అభియాన్ ద్వారా రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలో సుస్థిర అభివృద్ధి జరగాలంటే ప్రణాళికలే ముఖ్యమన్నారు. సర్పంచులు, కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీవో హంసవేణి, అధికారులు గురుమూర్తి, రవికుమార్, పవన్‌రాజు, సురేష్, అల్లెబ్బ, సంజీవరెడ్డి, రజని పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



తిరుపతి రూరల్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె పంచాయతీలో జాతీయ ఉత్పత్తి పంపిణీ పథక నిర్వహణదారుల సంక్షేమ సంఘ మండల కార్యాలయంలో గురువారం డీలర్ల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడు గుత్తా కోటేశ్వరనాయుడు ఆధ్వర్యంలో డీలర్ల సమస్యలపై చర్చించారు. జిల్లా, రాష్ట్రకమిటీ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలని తీర్మానించారు. కొత్త ఏడాది క్యాలెండరును నాయకులు ఆవిష్కరించారు. సంఘం ఉపాధ్యక్షురాలు వి.భానుమతి, కార్యదర్శి బి.ఏలుమలై, కోశాధికారి కె.దొరస్వామి, కె.లక్ష్మి, సి.దేవప్రసాద్, పి.మునిశేఖర్‌బాబు, డి.హరినాథ్ నాయుడు, ఎ.శివారెడ్డి పాల్గొన్నారు.

## అమిత్ షా వ్యాఖ్యలపై దళిత నాయకుల నిరసన



చంద్రగిరి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్రమంత్రి అమిత్ షా పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలను దళిత నాయకులు ఖండించారు. గురువారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దళిత నాయకుడు నాగపట్ల రాజుగోపాల్ మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు జరుగుతున్నందునే పేద, బడుగు, బలహీనులు, దళితులు, గిరిజనులకు న్యాయం జరుగుతోందన్నారు. అంబేద్కర్ ఆశయ పోరాట సమితి అధ్యక్షుడు బాదూరు, శ్రీపతి, క్రాంతి మనోహర్, సుబ్రమణ్యం, రాజు నాగరాజు పాల్గొన్నారు.



మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు చేపట్టిన యువగళం పాదయాత్ర పూర్తయి ఏడాది అయిన సందర్భంగా గురువారం ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన తనయుడు వినీల్ మంగళగిరి టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

-చంద్రగిరి (ఆంధ్రజ్యోతి)

## సుబ్రమణ్యం నాయుడికి టీడీపీ శాశ్వత సభ్యత్వం



చంద్రగిరి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. పనపాకంకు చెందిన ఆయన లక్ష రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వం పొందారు. గత వైసీపీ ప్రభుత్వంలో సుబ్రమణ్యంనాయుడును వైసీపీ ప్రభుత్వం అనేక ఇబ్బందులు పెట్టినా పార్టీ కోసం అహర్నిశలు పనిచేశారు. సార్వత్రిక ఎన్నికల్లో కీలకపాత్ర పోషించారు.

## నేటి రెవెన్యూ సదస్సు 23వ తేదీకి వాయిదా

తిరుపతిరూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట గ్రామ పంచాయతీలో శుక్రవారం జరుపతలపెట్టిన రెవెన్యూ సదస్సును అనివార్య కారణం వల్ల ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామాంజులునాయక్ పేర్కొన్నారు. గ్రామ రైతులు ఈ విషయాన్ని గమనించి సోమవారం జరిగే సదస్సుకు హాజరు కావాలని కోరారు.

## వేదోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ, వినాయక పూజ చేశారు. అభిషేకం చేశారు. స్వర్ణాభరణాలతో సుందరంగా అలంకరించారు. పలు హారతులు సమర్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## శాస్త్రోక్తంగా సంకట చతుర్దశి పూజలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజంజి వినాయకస్వామి ఆలయం వద్ద సంకట చతుర్దశిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రతి కుటుంబం గణపతిహోమం నిర్వహించుకునేలా సంకట చతుర్దశి నాడు చేసే హోమాన్ని ఆర్జిత సేవగా తీసుకు వచ్చారు. ఇందులో భాగంగా గురువారం అంజి అంజి గణపతి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కలశ స్థాపన పూజలు నిర్వహించి గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా చేశారు. అభిషేకం నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈవో బాపిరెడ్డి దంపతులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమం పేరుతో వసూళ్లపై అభ్యంతరం

శ్రీకాళహస్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమం పేరుతో వీధుల్లో సంచరిస్తూ కొందరు నగదు, వస్తువుల వసూలు చేయడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తిలోని జయరామరావువీధిలో గురువారం ఓ దంపతులు ఆటోతో ఇంటింటికీ వెళ్లి వృద్ధాశ్రమానికి నగదు, వస్తువులను వితరణ చేయాలని ప్రచారం చేశారు. స్థానికులు కొందరు వారిని వృద్ధాశ్రమం ఎక్కడ ఉంది. వసూలు చేసేందుకు ముందుగా ఎవరి నుంచి అనుమతి తీసుకున్నారంటూ నిలదీశారు. వారు సమాధానం చెప్పలేక నీళ్లు నములారు.

## చేనేతలకు అండగా ఉండాలి

**వరదయ్యపాళెం:** శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని గురువారం రాష్ట్ర దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ గుత్తి త్యాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. దేవాంగ కులస్తులకు, చేనేతలకు అండగా ఉండాలని కోరారు.

## డిజిటల్ చెల్లింపుల పట్ల అప్రమత్తం

మహిళలకు లీడ్‌బ్యాంక్ జిల్లా ఆఫీసర్ పూర్ణిమ సూచన



తనపల్లె వెలుగు కార్యాలయంలో మాట్లాడుతున్న పూర్ణిమ తదితరులు

రామచంద్రాపురం,డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఆన్‌లైన్‌లో నగదు చెల్లింపుల సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఆర్బీఐ లీడ్ బ్యాంక్ జిల్లా ఆఫీసర్ పూర్ణిమ సూచించారు. గురువారం వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ నేరస్తులు మహిళలను టార్గెట్ చేస్తున్నారన్నారు. ఎల్డీఎం చీఫ్ మేనేజరు విశ్వనాధరెడ్డి మాట్లాడుతూ ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ స్కీంను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజరు రాధాకృష్ణ మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం గ్రేడింగ్‌ను డ్వాక్రా మహిళలకు సూచించారు. ఏరియా కోఆర్డినేటర్ వరలక్ష్మి, ఏపీఎం గురుమూర్తి, డ్వాక్రా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

***తిరుపతి రూరల్:*** ప్రతి కుటుంబంలో ఒకరు వ్యాపారవేత్తగా ఎదగాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆర్బీఐ లీడ్ జిల్లా ఆఫీసర్ పూర్ణిమ చెప్పారు. తనపల్లె పంచాయతీలోని వెలుగు కార్యాలయంలో గురువారం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పొదుపు, భద్రత, ఆర్థికలావాదేవీలపై అవగాహన ఆమె కల్పించారు. లీడ్‌జిల్లా మేనేజర్ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ బ్యాంకు ఆవశ్యకత, సైబర్‌నేరాలు, పొదుపుసంఘాల ప్రాముఖ్యతను వివరించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభన్‌బాబు, ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు, సీసీ రమేష్, వీబీఏస్ క్లస్టర్ కోఆర్డినేటర్ కె.వెంచయ్య పాల్గొన్నారు.

## గ్యాస్ వాడకంపై విద్యార్థినులకు అవగాహన



ఎర్రావారిపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) 'మన వంట గది-మన బాధ్యత' జాగ్రత్త కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ పాఠశాలలో గురువారం ఎల్‌పీజీ గ్యాస్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక సాయిసూర్య ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకురాలు చింతపర్తి వనజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎల్‌పీజీ గ్యాస్ వాడకంలో ఐదు సూత్రాలు పాటించాలన్నారు. సిలిండర్ తీసుకొనేటప్పుడు నాజిల్ తనిఖీ చేసుకోవాలన్నారు. పొయ్యి సిలిండర్ కంటే ఎత్తులో ఉండాలన్నారు. వంట పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలన్నారు. గ్యాస్ లీకేజ్ ఉంగే వెంటనే 1906 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. నిర్ణీత కాలం తరువాత సురక్షిత ట్యూబ్‌ను మార్చుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌ఎంసీ చెర్మన్ స్వర్ణ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

## ఘాట్‌రోడ్డులో హెల్మెట్ లేకుంటే కఠిన చర్యలు



కోర్టు ఆదేశాల క్లిప్పింగ్‌ను అదనపు ఈవో కార్యాలయం సూపరింటెండెంట్ తులసికి అందజేస్తున్న సీఐ హరిప్రసాద్

తిరుమల, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): ఇకపై ఘాట్‌రోడ్లతో పాటు తిరుమలలో కూడా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ తెలిపారు. నిబంధనలకు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు హెల్మెట్ నిబంధనలను ద్విచక్ర వాహనచోదకులందరూ పాటించాన్నారు. గురువారం ఆయన సిబ్బందితో కలిసి తిరుమలలోని వివిధ విభాగాల అధికారులను కలిశారు. సిబ్బంది హెల్మెట్లు వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని వారిని కోరారు. హోటళ్లు, దుకాణాలు, మఠాల్లో పనిచేసే ఉద్యోగులు, వ్యాపారులకు ఈ సూచనలు చేశారు.

## కలుజుకాలువ పునరుద్ధరణ పనుల ప్రారంభం



ఎక్సవేటర్‌తో కాలువ పనులు

తిరుపతి రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పేరూరుగ్రామపంచాయతీ పరిధిలో ఎన్టీఆర్‌కాలనీకి సమీపంలోని సర్వేనంబరు 536లోని కలుజు కాలువ పునరుద్ధరణ పనులు చేపట్టారు. వ్యర్థాలతో పూడిపోయిన కాలువను ఎక్సవేటర్ సాయంతో తొలగిస్తున్నారు. ఎమ్మెల్యే పులివర్తినానీ చొరవతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈపనులు చేస్తున్నట్లు టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు నాగూరు శ్రీనివాసులు తెలిపారు. ఎన్టీఆర్‌కాలనీ, ఇతరప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు ఈ కాలువగుండా బయటకు వెళ్తుందని వివరించారు. ●ఎన్టీఆర్ కాలనీవద్ద సర్వేనంబరు 537లోని శ్మశానవాటిక స్థలంలో మొక్కలు, చెత్త, వ్యర్థాలని తొలగించి శుభ్రపరిచారు. 4.29 ఎకరాల విస్తీర్ణానికి గాను 1.43 ఎకరాలు మిగిలి ఉన్నట్లు సర్వే అధికారులు గుర్తించారు. ఇప్పటికే సగానికిపైగా ఆక్రమణలకు గురైంది. ఎమ్మెల్యే పులివర్తి నాని, తహసీల్దార్ రామాంజులునాయక్ చొరవతో శ్మశాన స్థలం శుభ్రతకు చర్యలు తీసుకున్నారు. మిగిలిన స్థలంలో సుందరీకరణ వంటి పనులను చేపట్టాలని ఎమ్మెల్యేను కోరామని టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు నాగూరు శ్రీనివాసులు తెలిపారు.

## రైల్వే విశ్రాంత ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలి




సమావేశంలో మాట్లాడుతున్న సాగరం శ్రీధర్

రేణిగుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైల్వే విశ్రాంత ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సాగరం శ్రీధర్ డిమాండ్ చేశారు. స్థానిక రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం విశ్రాంత ఉద్యోగ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే విశ్రాంత ఉద్యోగుల నోషనల్ ఇంక్రి మెంట్లు, కమ్యూ నికేషన్‌ను పది సంవత్సరాల ఎనిమిది నెలలకు నిలుపుదల చేసి ఎక్కువ మొత్తంలో వసూలు చేసిన నగదును తిరిగి చెల్లించాలన్నారు. పెన్షనర్లను ఇన్‌కమ్ ట్యాక్స్ పరిధి నుంచి విముక్తి కల్పించాలని కోరారు. పెన్షనర్లకు ఉద్యోగులతో సమానంగా హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఎనిమిదో పే కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రైలు ప్రయాణంలో సీనియర్ సిటిజన్లలో పురుషులకు 40 శాతం, స్త్రీలకు 50 శాతం రాయితీలను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసి యేషన్ రేణిగుంట డివిజన్ అధ్యక్షులు సాహెబ్, కార్యదర్శి జయంత్ కుమార్, రఘునాథరెడ్డి, రాజేంద్రన్, పాల్గొన్నారు.

## కానిస్టేబుల్, హోంగార్డుపై దాడి కేసులో ఏడాది జైలు శిక్ష

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్, హోంగార్డుపై దాడి చేసిన ఘటనలో మొదటి నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ గురువారం తిరుపతి ఆరవ అదనపు ప్రత్యేక న్యాయమూర్తి విజయచంద్ర రాణా తీర్పు చెప్పారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ కథనం మేరకు.. నగరంలోని పోస్టల్ కాలనీలో కాపురమున్న మేదరమిట్ట విక్రం చౌదరి 2015లో తన కారును తిరుపతిలోని కర్నాలవీధి వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ నిలిపాడు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేష్‌రెడ్డి, హోంగార్డు కృష్ణయ్య అక్కడకు వెళ్లి కారును తీయాలని సూచించారు. కారు తీయాలని చెప్పడంతో మరో వ్యక్తితో కలిసి వీరిపై చేయిచేసుకున్నాడు. ఈస్ట్ స్టేషన్‌లో వీరి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేశారు. గత తొమ్మిది సంవత్సరాలుగా కేసు నడుస్తోంది. ఇదే కేసులో రెండవ నిందితుడుగా వున్న చైతన్య గతేడాది మృతి చెందాడు. ప్రస్తుతం ఇరు వర్గాల వాదనలు విన్న తిరుపతి ఆరవ అదనపు ప్రత్యేక న్యాయమూర్తి విజయ చంద్ర రాణా.. మొదటి నిందితుడు విక్రం చౌదరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పినట్లు ఈస్ట్ సీఐ రామకృష్ణ చెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా చేయడంలో ప్రతిభ కనపరచిన ఈస్ట్‌కోర్టు కానిస్టేబుల్ అయ్యప్పను డీఎస్పీ వెంకటనారాయణ అభినందించారు.

## పట్టించుకోండి సారూ

### ఈ రోడ్డంటే హడలే..



రోడ్డు నిండా గుంతలే..

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈ రోడ్డులో నడవతరమా అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవిలాల నుంచి జాతీయ రహదారికి చేరుకునే మార్గం గుంతలమయంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరిపోయింది. విద్యార్థులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

### పైపు పగిలి తాగునీరు వృథా



తిరుపతిరూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట గ్రామపంచాయతీ పరిధిలోని చెంచులక్ష్మి కాలనీ మార్గంలో తాగునీటి పైపు పగిలిపోవడంతో నీరువృథాగా పోతోంది. ఈ నీరు రోడ్డుపై గుంతలోకి చేరుతుండటంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. పైపులైన్ మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే వ్యర్థాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

## బోడేవాండ్లపల్లెకు దారి మళ్లింపు

ఎర్రావారిపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి బోడేవాండ్లపల్లెకు వెళ్లే ప్రధాన మార్గాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు దారి మళ్లించారు. ఎర్రావారిపాలెం క్రాస్ రోడ్ నుంచి రాయపాటివారిపల్లెకు సీసీరోడ్ నిర్మాణ పనులు చేపట్టిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. బోడేవాండ్లపల్లెకు వాహనాలను ఎర్రావారిపాలెం బస్టాండ్ నుంచి బూడిదేటివారిపల్లె,వెల్లసానివారిపల్లె, చెరుకువారిపల్లె మీదుగా ఉదయమాణిక్యం నుంచి వెళ్లేలా ట్రాఫిక్‌ను మళ్లించారు. రూ.5 కోట్లతో ఎర్రావారిపాలెం క్రాస్‌రోడ్ నుంచి ఎల్లమంద రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఎన్నికల హామీలో భాగంగా ఎమ్మెల్యే నాని ఇటీవల పనులను ప్రారంభించారు.

## మహా శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష

శ్రీకాళహస్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయ మహాశివరాత్రి ఉత్సవాలపై అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఆలయ ఈవో బాపిరెడ్డి గురువారం పరిపాలన భవనంలో పలు విభాగాల అధికారులతో ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. ఫిబ్రవరి 20 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు నెలరోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేయాలని సూచించారు. గోపురాలకు రంగులు, విద్యుత్ అలంకరణలు, పూల అలంకరణలు, క్యూలైన్ల ఏర్పాట్లు, వసతుల కల్పన వంటి అంశాలపై అధికారులతో చర్చించారు.

## సిపాయి భరోసా పంపిణీ



గోపాల్‌రెడ్డి కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి

ఏర్పేడు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం కృష్ణంపల్లి గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి అనారోగ్యంతో పది రోజుల క్రితం మృతిచెందారు. ఆయనకు గురు వారం కర్మక్రియలు జరిగాయి. ఈ కర్మక్రియలకు ఎమ్మెల్సీ సిపాయిసుబ్రహ్మణ్యం హాజర య్యారు. గోపాల్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు సిపాయి భరోసా కింద 41 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీప్రసాద్‌రెడ్డి, భరత్‌రెడ్డి, రత్నంరెడ్డి, సర్పంచ్ రాజేశ్వరి, వైసీపీ నాయకులు పెంచలరెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి, నేలేరెడ్డి, ధానపసరెడ్డి, గెరటారెడ్డి, మునిరామిరెడ్డి, అశోకయ్య, చెంగయ్య, మురగారెడ్డి, అంకయ్య పాల్గొన్నారు.

## పేరూరు ఎన్‌హెచ్‌లో ఆక్రమణలు తొలగించండి



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్, డిప్యూటీ కలెక్టర్ రోస్మండ్

తిరుపతిరూరల్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): పేరూరు గ్రామపంచాయతీ పరిధిలో తిరుపతి-చంద్రగిరి జాతీయ రహదారికి ఆనుకుని చేపట్టిన ఆక్రమణలనడ తొలగించాలని హరిపురంకాలనీకి చెందిన వి.దామోదరంఆచారి కోరారు. పేరూరులో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ రామాంజులునాయక్‌కి అర్జీని అందజేశారు. స్పందించిన తహసీల్దార్ నెలరోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. సదస్సులో22 ఫిర్యాదులు అందజేశారు. రెవెన్యూసదస్సుల నియోజకవర్గ ప్రత్యేకాధికారి రోస్మండ్, ఆర్‌ఐ రఘువర్మ తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రాపురం:** రెవెన్యూసదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు వెంకటరమణ కోరారు. రామాపురం పంచాయతీలో గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. పొలాల్లోకి వెళ్లేందుకు దారి కల్పించాలని దుర్గసముద్రం గ్రామానికి చెందిన చెంగల్రాయులు,మునికుమార్, నాగయ్య తహసీల్దారుకు వినతి ఇచ్చారు. సదస్సులో 47 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో డీటీ అన్వర్‌బాషా, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# పట్టించుకోండి సారూ..



స్విమ్స్ ఓపీడీ భవనంలో స్లాబు పైభాగంలో సీలింగ్ పెచ్చులూడి ప్రమాదకరంగా కనిపిస్తోంది. సీలింగ్‌లో అమర్చిన విద్యుత్తు తీగలు, ఇనుప రాడ్లు వంటివి జారి రోగులపై పడుతున్న సందర్భాలున్నాయి. ఇలాగే వదిలేస్తే పెద్దయెత్తున ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- తిరుపతి(వైద్యం)
(ఆంధ్రజ్యోతి)



మంగళం బీసీఎం స్కూల్ సమీపంలో రోడ్డుపక్కన వ్యర్థాలు, చెత్తకుప్పలు నిల్వ ఉంటున్నాయి. కొన్ని నెలలుగా పారిశుధ్య కార్మికులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో నిల్వలు పేరుకుపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసి దుర్గంధం వెదజల్లుతున్నాయి. కుక్కలు, పందులు వ్యర్థాలను రోడ్డుపైకి ఈడ్చి పడేస్తుండడంతో పారిశుధ్యం లోపిస్తోంది. అటువైపుగా వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

- తిరుపతి అర్బన్
(ఆంధ్రజ్యోతి)

శెట్టిపల్లిలోని ఒక వీధిలో వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉండి స్థానికులకు ఇబ్బందిగా మారింది. మూడు వీధులుండగా రెండు సిమెంట్ రోడ్లు వేశారు. చివరి వీధి పల్లంగా మారడం, డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపునీరు అక్కడే నిల్వ ఉంటోంది. స్థానికులు అవస్థలు పడుతున్నారు. దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, సచివాలయ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు.

- తిరుపతి అర్బన్
(ఆంధ్రజ్యోతి)





## శుద్ధజల కేంద్రం ప్రారంభం



శుద్ధ జలాలను ప్రారంభిస్తున్న సచివాలయ కార్యదర్శి జయశంకర్

తిరుపతి అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంగళం ఉమ్మడి పంచాయతీ పరిధిలోని సప్తగిరికాలనీ వార్డు సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శుద్ధజల సరఫరా కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. గత అక్టోబరు 21న ఆంధ్రజ్యోతిలో నీటిశుద్ధి కేంద్రానికి మంగళం శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన గ్రామ సచివాలయ యంత్రాంగం చర్యలు చేపట్టింది. రూ.5కు 20లీటర్ల శుద్ధ జలాలు సరఫరా అయ్యేలా ఏర్పాట్లు చేశారు.

## రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఫెన్సింగ్ క్రీడాకారులు

తిరుపతి (క్రీడలు), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలో గురువారం జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి పదిమంది క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన ఏడుగురిని ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీధర్, ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జ్ పీగీత క్రీడాకారులను అభినందించారు. ఎంపికైన క్రీడాకారులలో జి.భవిష్య, పి.కృషిత, ఈ.రమ్యశ్రీ, ఎన్.శ్రీకర్, టి.ధీరజ్‌నారాయణ, ఎస్.మహమ్మద్ అక్రరుద్దీన్, ఎస్.మహమ్మద్ సైఫుద్దీన్ ఉన్నారు.

## స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ఓవరాల్ ఛాంపియన్ పద్మావతి మహిళా పాలిటెక్నిక్



క్రీడా పోటీల్లో ప్రతిభచాటిన పద్మావతి మహిళా పాలిటెక్నిక్ విద్యార్థులు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో రెండు రోజులుగా జరిగిన రీజనల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024-25లో శ్రీపద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాల క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలిచారు. ఖోఖో, టేబుల్ టెన్నిస్ (సింగిల్స్ డబుల్స్), చెస్, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో విజేతలుగా, వాలీబాల్, షాట్‌పుట్‌లో రన్నరప్‌గా, పరుగు పోటీలు 100మీటర్లలో తృతీయ, 200 మీటర్లలో ద్వితీయ, 400 మీటర్లలో ద్వితీయ, ట్రిపుల్ జంప్‌లో తృతీయ స్థానాల్లో నిలిచారు. వారిని టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ వైనాగరాజునాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ జి.అనంత అభినందించారు.

## కుస్తీపోటీల చాంపియన్‌గా పద్మావతి మహిళా జూనియర్ కళాశాల



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భువనేశ్వరి

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో ఇటీవల జరిగిన జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు చాంపియన్‌గా నిలిచారు. ఈ.సంజన, పి.చైత్ర, జి.ప్రసన్న, ఎ.అమృత(స్వర్ణపతకం), డి.రిజ్వాన, శివపొందు, కోటేశ్వరి, సౌజన్య, తనుశ్రీ, నిత్యశ్రీ, బ్రాంజ్మరియ(వెండిపతకం) సాధించారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి క్రీడాకారులను, వారికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సాయిసుమతిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ డాక్టర్ స్నేహలత, జయమ్మ పాల్గొన్నారు.

## బ్రాహ్మణ కుటుంబాలకు రూ.20లక్షల రుణాలు



తిరుపతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ద్వారా దాదాపు 28 బ్రాహ్మణ కుటుంబాలకు రూ.20.60 లక్షల రుణాలను చెక్కు రూపంలో గురువారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రుణాలను వాడుకుని పేద బ్రాహ్మణ కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతరావు, కుమార్, టీడీపీ నేతలు మన్నెం శ్రీనివాసులు నాయుడు, మునిశేఖర్ రాయల్, పసుపులేటి శ్రీను, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## నేటి నుంచి శిల్పారామంలో ఖాదీ ఎగ్జిబిషన్



సమావేశంలో మాట్లాడుతున్న కేవీఐసీ డిప్యూటీ సీఈవో మదన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో శుక్రవారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు ఖాదీ మహోత్సవం ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ డిప్యూటీ సీఈవో మదన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శిల్పారామంలో గురువారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడుతూ పీఎంయూజీపీ, ఖాదీ సంయుక్త ఆధ్వర్యంలో శిల్పారామంలో వంద స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖాదీ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు, హస్తకళలు, కలంకారీ, తేలు ఉత్పత్తులు ఈ ఎగ్జిబిషన్‌లో ఉంటాయన్నారు. 26 డిపార్ట్‌మెంటల్ సేల్స్ అవుట్‌లెట్స్, 88వేల రీటైల్ సేల్స్ అవుట్‌లెట్స్, 5సెంట్రల్ ప్లాంట్స్ ద్వారా అమ్మకాలు సాగుతాయని వివరించారు. నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేటి నుంచి అంతర పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్

తిరుపతి(విద్య), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వేదికగా శుక్రవారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు 27వ రీజనల్ అంతర పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్(బాలురు) నిర్వహిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్వీ రమణకుమార్, జనరల్ విభాగం హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్ పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు జరిగే ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, గౌరవ అతిథులుగా మేయర్ డాక్టర్ ఆర్.శిరీష, శాప్ చైర్‌పర్సన్ ఎ.రవినాయుడు హాజరుకానున్నారని తెలిపారు.

## వైభవంగా దుర్గాదేవి ఊరేగింపు

తిరుపతి(లీలామహల్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల బైపాస్ రోడ్డులో వెలసిన దుర్గాదేవి ఊరేగింపు గురువారం రాత్రి వైభవంగా జరిగింది. చాందినీబండి అలంకరణతో బళ్లారి డ్రమ్ముల నడుమ అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. లీలామహల్, ఆర్టీసీ బస్టాండు, కర్ణాలవీధి, గాంధీరోడ్డు మీదుగా ఊరేగింపు సాగింది. దారి పొడవునా భక్తులు హారతులు సమర్పించారు. ఉదయం నుంచి ఆలయంలో మహాచండీయాగం నిర్వహించారు. 30 ఏళ్లుగా ఏటా ఈ ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు సీహెచ్ నరసింహస్వామి తెలిపారు.

## జీవన విధానాన్ని మార్చేదే సరైన విద్యా విధానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవన విధానాన్ని మార్చేదే సరైన విద్యా విధానమని నలంద యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ రాజేశ్వర్ పేర్కొన్నారు. పద్మావతి యూనివర్సిటీ మాజీ వీసీ వీణా నోబుల్‌దాస్ స్మారకోపన్యాసంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. నలంద యూనివర్సిటీ చరిత్ర ప్రాచీనమైనదే కాకుండా ప్రత్యేకత కూడా పొందిందన్నారు. నలంద యూనివర్సిటీ విద్యా విధానాన్ని నూతన జాతీయ విద్యా విధానంలో పొందుపరిచారని తెలిపారు.

## స్త్రీలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా వ్యాపారవేత్తగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. తిరుపతి రూరల్ మండలం తనపల్లి పంచాయతీ కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై మహిళా సంఘాలకు అవగాహన కల్పించారు. డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పొదుపు, భద్రత, ఆర్థిక లావాదేవీలపై ఆర్‌బీఐ లీడ్ డిస్ట్రిక్ ఆఫీసర్ పూర్ణిమ మహిళా సంఘాలకు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 40 రోజుల్లో హాస్టళ్ల మరమ్మతులు పూర్తి చేయాలి

### బాలికల హాస్టల్లో ఖాళీ మద్యం సీసా కనిపించడంపై ఎమ్మెల్యే ఆగ్రహం





ఎమ్మెల్యేకి మద్యం సీసా చూపుతున్న కూటమి నేతలు - హాస్టల్ భవనం పెచ్చులూడి ఉండడంపై ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 5 సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో మరమ్మతు పనులు జనవరిలోపు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. చెన్నారెడ్డి కాలనీలోని హాస్టల్స్‌ను ఆయన గురువారం పరిశీలించారు. మొదటగా ఎస్సీ బాలికల హాస్టల్‌ను పరిశీలించగా ఫ్లోరింగ్ పెచ్చులు ఊడి ఉండటాన్ని గమనించారు. బాత్ రూమ్‌లకు తలుపులు లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వాడిన కూరగాయలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ తాజా కాయగూరలనే వాడాలని ఆదేశించారు. హాస్టల్ ప్రాంగణంలో చెట్టుకింద మట్టిలో ఉన్న మద్యం సీసాను కూటమి నేతలు గుర్తించి ఎమ్మెల్యేకి చూపించగా ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ వార్డెన్‌ను వివరణ అడిగారు. పక్కనే నివాసాలున్న వారు ఎవరో పడేసివుంటారని, మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని అధికారులు చెప్పారు. అనంతరం బీసీ హాస్టల్‌ను పరిశీలించారు. వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ ఆవరణను శుభ్రంగా ఉంచాలని వార్డన్లను ఆదేశించారు. హాస్టల్స్ బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహాచారి, టీడీపీ నాయకులు మహేష్ యాదవ్, పాటకం వెంకటేష్, కేవీ రమణ, ఆదిలక్ష్మి, రాధిక, జనసేన నాయకులు వనతల వెంకటేష్, విజయ్ రాయల్, కీర్తన, బాబ్జీ, వినోద్ రాయల్, కేఎంకే లోకేష్, ఆముదాల వెంకటేష్ పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థికి టెక్సాస్‌లో ఉద్యోగం

### ల్యాబ్ ఇంజనీర్‌గా రూ.9.94లక్షల వార్షిక వేతనం



విద్యార్థిని అభినందిస్తున్న రమణకుమార్, గౌరీశంకర్

తిరుపతి(విద్య), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ (ఈసీ) తృతీయ సంవత్సర చదువుతున్న బి.శ్రీజశృతి బెంగళూరుకు చెందిన టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ సంస్థలో ఉద్యోగానికి ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్వీ రమణకుమార్, జనరల్ విభాగం హెడ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్ తెలిపారు. కళాశాలలో ఇటీవల ఆ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో శ్రీజశృతి ల్యాబ్ ఇంజనీర్ ఉద్యోగానికి ఎంపికైనట్లు వెల్లడించారు. వార్షిక వేతనం రూ.9.94లక్షలుగా ఉంటుందని తెలిపారు. విద్యార్థికి నియామకపత్రాన్ని అందజేసి అభినందించారు. ఆమె కర్నూలు జిల్లా కె.నాగలాపురానికి చెందిన రైతు శ్రీనివాసులు కుమార్తె.

## బాలభవన్‌లో మరిన్ని వసతులు కల్పిస్తాం

● చిన్నారులతో కలిసి భోజనం చేసిన భానుప్రకాష్‌రెడ్డి



బాలభవన్ చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి (విద్య), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న చిన్నారుల అనాథాశ్రమ పాఠశాల బాల భవన్‌ను టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి గురువారం పరిశీలించారు. చిన్నారులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. చిన్నారులతో కలిసి భోజనం చేశారు. చిన్నారులకు మరింతగా వసతి సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

## రేపు వరల్డ్ ఫస్ట్ మెడిటేషన్ డే

తిరుపతి(లీలామహల్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శనివారం ప్రపంచ మొదటి ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గురువారం ప్రెస్‌క్లబ్‌లో తిరుపతి స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు కంచి రఘురామ్ తెలిపారు. అన్నమాచార్య కళా మందిరంలో ఉదయం 10.30 నుంచి జరిగే కార్యక్రమంలో తిరుపతి వాసులు పాల్గొనాలని కోరారు.

# అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసన



నిరసన తెల్పుతున్న విద్యార్థులు, నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ గురించి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు ఎస్వీయూలో పలు విద్యార్థి, యువజన సంఘాలు వేర్వేరుగా నిరసన తెలిపాయి. చిన్న (ఏబీఎస్ఎఫ్), మల్లికార్జున (ఎస్ఎఫ్ఐ), శివశంకర్‌నాయక్ (గిరిజన సంఘ్), సుందర్ (ఎస్ఎల్ఎస్ఏ), అక్బర్ (ఎస్ఎఫ్ఐ), ప్రేమ్‌కుమార్ (వైఎస్ఆర్ఎస్‌యు) నిరసన తెలియచేశారు. అమిత్‌షా వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

● అంబేడ్కర్ విగ్రహం వద్ద : బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షులు పుణ్యమూర్తి, వైఎస్సార్‌ఎస్‌యూ వర్సిటీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ఎస్ఎల్ఎస్ఏ అధ్యక్షుడు సుందరాజు తదితరులు నిరసన తెలిపారు. అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలన్నారు.

**తిరుపతి(వైద్యం):** అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో అనుచితంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ముందు ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాంభూపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటనరసింహులు, శివశంకర్, నరేంద్రబాబు పాల్గొన్నారు.

**తిరుపతి(ఆటోనగర్):** అంబేడ్కర్ గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సీఐటీయూ నేత ఎస్.జయచంద్ర, ఐద్వా నాయకురాలు డాక్టర్ సి.హేమలత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్వీ యూనివర్సిటీ గేటు ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సుమన్, చిట్టిబాబు, ధనంజయులు పాల్గొన్నారు. కాగా, సీపీఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ పార్టీ నాయకులు నిరసన తెలిపారు.



# చల్లా బాబుకు పలువురి శుభాకాంక్షలు





రొంపిచెర్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లెలో పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి మంగాపురంలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని రొంపిచెర్ల మండలానికి ఆయన రాగానే టీడీపీ శ్రేణులు హారతులు పట్టి, మంగళవాయిద్యాలతో స్వాగతించారు.చల్లా ఇంటికి వచ్చిన పలువురు అధికారులు ఆయనకు పూలమాలలు వేసి, దుశ్శాలువాలు కప్పి సత్కరించారు.చల్లా బాబు తన తల్లి, మాజీ ఎంపీపీ ప్రేమలతమ్మ, భార్య , మాజీ సర్పంచ్ చల్లా సుప్రియారెడ్డి, కుమార్తె పూజారెడ్డి, టీడీపీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు.మండల టీడీపీ అధ్యక్షుడు, కురబ కుల కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, మాజీ కన్వీనర్లు ఓబులేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ రవికుమార్ నాయుడు, మాజీ ఎంపీటీసీ బి.అమరనాథరెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ అమరనాథరెడ్డి, నాయకులు శ్రీనివాసులు నాయుడు, అబ్బారెడ్డి విజయ్, వి.మదన మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు సహదేవ, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు గూడూరు హరిబాబు, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, శేషాద్రి నాయుడు, జేసీబీ బాబురెడ్డి, కిరణ్‌కుమార్, సిద్ధయ్య, ఉయ్యాల శశి, వల్లిపోగు వెంకట్రమణ, పొన్నం వెంకట్రమణ, మేడసాని రవికుమార్ నాయుడు, నరిన్, గోవర్ధన్‌రెడ్డి, అంజనేయులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ పొదుపుతో ఇంధనం ఆదా

ఎస్ఈ సురేంద్ర నాయుడు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు విద్యుత్ పొదుపు చేస్తే రెండు రెట్లు ఇంధనం ఆదా చేసిన వారవుతారని తిరుపతి సర్కిల్ ఎస్ఈ పి.సురేంద్రనాయుడు అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఎస్ఈ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యుత్ పొదుపు చేయడానికి ఫైవ్ స్టార్ రేటింగ్ వస్తువులు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఎల్ఈడీ బల్బులు వినియోగించాలని సూచించారు. ఇంధనం పొదుపు చేస్తే బావితరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ర్యాలీ నగర వీధుల ద్వారా ఆర్టీవో కార్యాలయానికి చేరుకుంది. కార్యక్రమంలో ఈఈలు ఎన్.వాసురెడ్డి, వి.చంద్రశేఖర్ రావు, వాసవీలత, బాలాజీ, రవికుమార్, ఏడీఈలు భాస్కర్‌నాయుడు, జయప్రకాష్, మునిప్రసాద్, ఏఈలు ఎల్.చలపతి, శ్రీనివాసులునాయుడు, గుణశేఖర్, బాషా, కేశవులనాయుడు, మురళి, నీలకంఠం, మునిరాం, శివాజీ, ఏఏఈలు టిజయరామ్, చక్రపాణి, అసోసియేషన్ నాయకులు వెలగటూరు గోపి, కార్తీక్, మురళీధర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ టోర్నీకి ఎస్వీయూ ఫుట్‌బాల్ జట్టు



తిరుపతి(క్రీడలు), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీకి ఎస్వీయూ ఫుట్‌బాల్ పురుషుల జట్టు ఎంపికైనట్టు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.శివశంకర్ రెడ్డి తెలిపారు. శనివారం కేరళలోని కాలికట్‌లో జరిగే పోటీలలో పాల్గొనేందుకు 20మందితో కూడిన జట్టు గురువారం పయనమైంది. ఎస్.సుదర్శన్‌రెడ్డి కోచ్‌గా, డాక్టర్ ఎస్.గఫూర్ మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్వీయూ మాజీ ఫుట్‌బాల్ ఆటగాడు డాక్టర్ ఎం.ఎస్.నజరుద్దీన్ పాల్గొని క్రీడాకారులకు దుస్తులు, సామగ్రి పంపిణీ చేశారు.

**జట్టులో స్థానం దక్కినవారి వివరాలిలా..**

ఆర్.డేనియల్(ఎస్వీపీ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ శ్రీకాళహస్తి), కె.మహమ్మద్‌అన్సారీ(శేషాచల డిగ్రీ కాలేజీ పుత్తూరు), బీ.ఉదయ్‌కిరణ్‌రెడ్డి(వింగ్ బిజినెస్ స్కూల్ తిరుపతి), ఆర్.జనీష్‌రెడ్డి(సీకాం డిగ్రీ కాలేజీ తిరుపతి), ఎస్.మహమ్మద్‌బాషా(మదర్‌థెరీసా ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ పలమనేరు), ఎ.దిలీప్, టి.ఉదయ్‌కిరణ్, కే.శ్రీనివాసులు(గవర్నమెంట్ డిగ్రీకాలేజీ పుత్తూరు), ఎం.నరసింహులు, డి.చంద్రశేఖర్, వి.హరీష్, ఎం.మహేష్, వి.రేవంత్‌బాబు(ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ, తిరుపతి), సి.అశోక్, జి.ధనుష్‌వంశీ(గేట్ డిగ్రీ కాలేజీ తిరుపతి), ఎస్.విజయ్, ఆర్.హెచ్.ప్రశాంత్(సిద్ధార్థ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ తిరుపతి), బి.వెంకటబాలాజీ(ఎస్వీయూ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్), ఎస్.మహమ్మద్‌ఉజైర్(శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ మదనపల్లి), ఆర్.శిబిరాజ్(గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ నగరి).

## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. లక్షదీప్ గవర్నర్ ప్రఫుల్ ఖోడా పటేల్, తెలంగాణ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్, మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు, మాజీ జేఈవో శ్రీనివాసరాజు, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఖుషణ్ ప్రసాద్ సింగ్, హిమాచల్‌ప్రదేశ్ లోకాయుక్తా జస్టిస్ సీబీ బరావలియా ఉన్నారు.



ప్రఫుల్ ఖోడా పటేల్ - జస్టిస్ ఖుషణ్ ప్రసాద్ సింగ్



తలసాని శ్రీనివాసయాదవ్, పుట్టా సుధాకర్‌యాదవ్





సర్వదర్శనానికి

**15 గంటలు**

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్ట్‌మెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం : రూ.4.16 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 70,457

తలనీలాలు సమర్పించినవారు : 22,152



# గంటలోపే దర్శనం

చైర్మన్ అనే హోదాను అనుభవించడానికి నేనీ బాధ్యత స్వీకరించలేదు. స్వామి కొలువు గొప్పవరం. తిరుమలకు వచ్చే వెళ్లే ప్రయాణం, బస, భోజనం వంటి ఖర్చులు ఏవీ టీటీడీ మీద భారం మోపడం లేదు. సొంతంగా నేనే పెట్టుకుంటున్నా. దర్శనాల కోసం చైర్మన్ మీద ఎంత ఒత్తిడి ఉంటుందో అందరికీ తెలుసు. అయినా.. దర్శన టికెట్ల కోటాను కూడా నేను వినియోగించుకోవడం లేదు.

టీటీడీకి వచ్చే ఆదాయానికంటే, చేసే ఖర్చే అధికంగా ఉంటోంది. మళ్లీ కుబేరుడివంటి వారిని వెతుక్కుని అప్పు చేయాలి. అలా చేసి పెట్టారు టీటీడీని. వ్యక్తిగత పనులన్నీ వదిలేసి తిరుమలలోనే ఉంటూ అన్నింటిపై దృష్టి సారించా. స్వామికి చెందిన ఒక్క రూపాయి కూడా వృథా కానివ్వను.

తిరుమల ప్రక్షాళన మొదలైంది

ఆక్రమించిన మఠాల జోలికే వెళ్తాం!

తిరుమలలో 30 దుకాణాలు తిరిగితే కనీసం శ్రీవేంకటేశ్వరస్వామి ఉండే ఉంగరాలు దొరకవు కానీ, శిలువ బొమ్మలుండే కడియాలు ఉంటున్నాయి. దుకాణాల వ్యవహార తీరును కూడా మార్చాలి.

అన్నేసి గంటలు క్యూలో ఉండడం మానవహక్కుల ఉల్లంఘనే

INTERVIEW

## టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

ఆయన వెంట మందీ మార్బలం కనిపించదు. ఆర్భాటం అసలు ఉండదు. హడావుడి లేదు. తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఆయన శైలి విలక్షణం. ఒక సాధారణ భక్తుడిలా తిరుమల అంతా కలియతిరుగుతుంటారు. భక్తులతో మాట్లాడతారు. దుకాణాలను పరిశీలిస్తారు. ఒక రీసెర్చర్‌లా వివరాలు తెలుసుకుంటారు. ఆ తర్వాత అధికారులతో మాట్లాడతారు. గుర్తించిన లోపాలు వివరించి సరిదిద్దుకునే అవకాశాలేమిటని ఆరా తీస్తారు. సీఎం చంద్రబాబు ఆకాంక్షను నెరవేర్చే దిశగా తిరుమల ప్రక్షాళనకు పూనుకున్నారు టీటీడీ కొత్త చైర్మన్ బీఆర్ నాయుడు. పెనుమూరు మండలం దిగువపూనేపల్లిలో పుట్టి పెరిగిన ఈయన తొలుత బీహెచ్‌ఈఎల్‌లో ఉద్యోగం చేశారు. ఆ తర్వాత వ్యాపార వేత్తగా స్థిరపడ్డారు. నవంబరు 6న టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బీఆర్ నాయుడు గత చైర్మన్లకు భిన్నంగా తన ఖర్చులన్నీ తనే పెట్టుకుంటూ తిరుమలలో ఉంటున్నారు. తిరుమలలో భక్తుల కష్టసుఖాలు తెలుసుకుంటూ, టీటీడీ అనుపానులు గ్రహిస్తూ ఆచితూచి అడుగేస్తున్న బీఆర్ నాయుడితో ఆంధ్రజ్యోతి సంభాషణలోని ముఖ్యాంశాలు...

- తిరుమల, ఆంధ్రజ్యోతి

**? చైర్మన్ కావాలని ఎప్పుడు అనిపించింది. ఎందుకు.**

! దాదాపు పదిహేనేళ్ల కిందటే టీటీడీ ధర్మకర్తల మండలికి చైర్మన్ కావాలని కోరుకున్నా. చిత్తూరు జిల్లాలో పుట్టిపెరిగిన వాడిగా ఇక్కడుండే సమస్యలన్నీ నాకు తెలుసు. నేను చైర్మన్ అయితే మార్పులు చేయగలనని చిన్న ఆశ. స్వామి ఇచ్చిన ఈ అవకాశాన్ని గొప్పవరంగా భావిస్తున్నా. నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ తిరుమలకు వస్తూనే ఉన్నాను. శ్రీవేంకటేశ్వర స్వామి మీద అచంచల భక్తి చిన్నప్పటి నుంచే ఉంది.

**? గతంలో దర్శనానికి ఎప్పుడైనా ఇబ్బంది పడ్డారా.**

! 10 గంటలకుపైనే క్యూలైన్‌లో వేచి ఉండి స్వామిని దర్శించుకున్న సందర్భాలున్నాయి. ఒక్కోసారి క్యూలైన్‌లో వెళ్లే సమయం లేక పుష్కరిణిలో కాళ్లు కడుక్కొని, తలపై చల్లుకుని, కొబ్బరికాయ కొట్టి వెళ్లిపోయేవాడిని. గొల్లమండం నుంచే స్వామికి నమస్కరించుకుని ఈసారికి ఇదే భాగ్యం అనుకునేవాడిని. గతంలో గవర్నమెంట్ సర్వీస్‌లో ఉండేవాడిని. సెలవులు తక్కువ. టైం ఉండదు కాబట్టి అన్నేసి గంటలు క్యూలో ఉండే వీలుండేది కాదు.

**? చైర్మన్‌గా తిరుమలలో మీరు గుర్తించిన లోపాలేంటి.**

! ప్రధానంగా స్వామి దర్శనానికి వచ్చే వారిని 20 నుంచి 30 గంటల పాటు కంపార్టుమెంట్లలో కూర్చోబెట్టి తాళాలు వేసేస్తున్నారు. లోపలికి రానివ్వరు, బయటకు పోనివ్వరు. నా దృష్టిలో అది కరెక్ట్ కాదు. మానవ హక్కుల ఉల్లంఘన అవుతుందని గతంలో కూడా చెప్పాను. భక్తులు చాలా ఇబ్బందులు పడటాన్ని స్వయంగా చూశా. ఐదు కిలోమీటర్ల పొడవుతో ఉన్న క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి నిలుచుంటున్నారు. వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఇబ్బంది పడుతున్నారు. అంతదూరం నడిపించాల్సిన అవసరం ఏమిటీ? అలాగే వ్యర్థాల తొలగింపు సరిగా జరగడం లేదు. కుప్పలుకుప్పలుగా చెత్త పేరుకుపోయింది. చెత్త తొలగింపునకు ఒక సంస్థకు రూ.20 కోట్లకు కాంట్రాక్ట్ ఇచ్చారు. వారి నిర్వహణ సరిగా లేదు. డబ్బులు ఇచ్చిమరీ చెత్తను తీసుకెళ్లేవారు ఉంటే, వాళ్లను వదిలేసి మనమే డబ్బు ఇచ్చి చెత్త తీసుకువెళ్లండి అనడం ఏమిటో? అనంప్తను మార్చాలనుకుంటున్నాం. ఇక, స్విమ్స్ ఆస్పత్రికి ఏడాదికి రూ.వంద కోట్లు టీటీడీ ఇస్తోంది. ఈ అంశంపై తగిన సూచనల కోసం మాజీ ఐఏఎస్ అధికారి ఐవీ సుబ్బారావు ఆధ్వర్యంలో ఓ కమిటీని వేశాం. స్విమ్స్ నిర్వహణే సక్రమంగా లేదనుకుంటే, కమీషన్ల కోసం కక్కుర్తిపడి గతంలో పిల్లల ఆస్పత్రి, క్యాన్సర్, హార్ట్ ఆస్పత్రి అని పెట్టారు. ఇవన్నీ అవసరమా?. రూ.వెయ్యి కోట్ల నుంచి రూ.1,200 కోట్లు పెట్టి భవనాలు కడుతున్నారు. కట్టి ఏం చేస్తారు. టీటీడీ పని అదేనా? ఆలయాలు లేని చోట కట్టించాలి. నైవేద్యం లేని చోట ఏర్పాట్లు చేయాలి. భజనలు, హిందు ధర్మప్రచార కార్యక్రమాలు చేయాలి. దాని కోసం కదా టీటీడీ ఖర్చు చేయాల్సింది.

**? ఆభరణాలు, బంగారు నిల్వలు భద్రంగానే ఉన్నాయా.**

! అన్ని సేఫ్‌గానే ఉన్నాయి. ఎలాంటి సందేహాలు అవసరం లేదు.

**? ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీ ఎందుకు.**

! ఉద్యోగుల్లో కొంతమంది భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. కొందరైతే బూతులు మాట్లాడుతున్నారు. వాదవివాదాల్లో భక్తులపైకి కొట్టేందుకు కూడా కొందరు వెళ్లిపోతున్నారు. అటువంటి వాళ్లను భక్తులు ఎలా గుర్తుపట్టాలి?. అందుకే నేమ్ బ్యాడ్జీ ఉంటే భక్తులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా ఉంటుంది. ఆ తర్వాత విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. దీనిపై బోర్డులో చర్చించి త్వరలోనే అమలుచేస్తాం.

**? ఎలాంటి మార్పులు చేయాలనుకుంటున్నారు.**

! ఎయిర్‌పోర్టులో డిజి యాత్ర విధానాన్ని అందరూ చూసే ఉంటారు కదా. అదే తరహాలో ఏఐ సహకారంతో తిరుమల శ్రీవారి దర్శనాన్ని కూడా గంట వ్యవధిలోనే చేయించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. భక్తుడు తిరుపతికి రాగానే ఆధార్‌కార్డును లింక్ చేసి ఫేస్‌రికగ్నిషన్‌తో టోకెన్ జారీ చేస్తాం. అందులో టైం వచ్చేస్తుంది. ఆ సమయానికి క్యూకాంప్లెక్స్ వద్దకు వస్తే నేరుగా లోపలికి వెళ్లిపోవచ్చు. వేరేవేరు ప్రాంతాల్లో కావాల్సినన్ని కౌంటర్లు ఏర్పాటు చేస్తే తోపులాటలు కూడా ఉండవు. ఇప్పటికే ఇతర దేశాలకు చెందిన ఐదారు సంస్థలు ఈ వ్యవస్థ ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చాయి.. ఉచితంగా చేస్తామంటున్నారు. త్వరలో ప్రయోగాత్మకంగా పరిశీలిస్తాం. సత్ఫలితాలు వస్తే రెండు మూడు నెలల్లోనే అమలుచేస్తాం. ఏఐ అందుబాటులోకి వస్తే వసతికి ఇబ్బందులు కూడా ఉండవు.

**? టీటీడీలో అన్యమత ఉద్యోగుల తొలగింపు సాధ్యమేనా.**

! వంద శాతం సాధ్యమే. మనం వాళ్ల పొట్టపై కొట్టడం లేదు. ప్రత్యామ్నాయాలు ఉన్నాయి కదా. ముందు మంచి బెనిఫిట్స్‌తో వీఆర్‌ఎస్ ఇస్తాం. లేకుంటే ప్రభుత్వానికి డిప్యూటేషన్‌పై సరెండర్ చేస్తాం. వాళ్లు కూడా వద్దంటే వేరే ఆలయాలు ఉన్నాయి కదా. జమ్ము, ముంబై, కన్యాకుమారి వంటి వాటికి మారుస్తాం. పేరేమో వెంకటేశ్వరరావు అని ఉంటుంది. కానీ తిరుపతిలో చర్చిలు నిర్వహిస్తూ ఉంటారు. ఇంట్లోనే చర్చి ఉంటుంది. ఏం చేయాలి వాళ్లని? భక్తన్నా ఉండాలి.. లేదా భయమైనా ఉండాలి. వాళ్లకి ఆ రెండూ లేవు.

**? తిరుమలలో మఠాల నిర్వహణపై మీ స్టాండ్ ఏమిటి.**

! అదో తేనె పట్టు. ఎన్నో ఏళ్ల నుంచా ఉన్న వాళ్లను ఎలా ఇబ్బంది పెడతాం. మఠాధిపతులు, పీఠాధిపతులు అందరు ఉన్నారు ఇక్కడ. కొన్ని మఠాలు వ్యాపార కేంద్రాలుగా మారిపోతున్నాయనే విమర్శలు వస్తునే ఉన్నాయి. టీటీడీ కేటాయించిన స్థలాల్లో కాకుండా అదనపు స్థలాలను ఆక్రమించుకుంటే మాత్రం.. వాటిపై చర్యలు తీసుకుంటున్నాం.

**? టీటీడీ డిపాజిట్ల మళ్లింపు ప్రక్రియ ఏదశలో ఉంది.**

! దాదాపు రూ. 4,800 కోట్లు ప్రైవేట్ బ్యాంకుల్లో ఉన్నాయి. ప్రస్తుతం వాటి జోలికి వెళ్లం. కాలపరిమితి పూర్తవగానే భద్రత కోసం జాతీయ బ్యాంకులకు మళ్లిస్తాం. ఇక కొత్త డిపాజిట్‌లు అన్నీ మాత్రం జాతీయ బ్యాంకుల్లోనే వేస్తాం.

**? టీటీడీలో ప్రక్షాళన చేస్తామని సీఎం అన్నారు. ఆదిశగా ఏం చేస్తున్నారు**

! గతంలో జరిగిన కొన్ని అక్రమాలపై ఇప్పటికే ప్రభుత్వం స్టేట్ విజిలెన్స్‌తో విచారణ చేయిస్తోంది. నెయ్యి కల్తీ వ్యవహారంపై కూడా సిట్ వేగంగా దర్యాప్తు చేస్తోంది. దానిపై ఇప్పట్లో ఏం మాట్లాడలేం. రిపోర్టులు వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించుకుంటాం. గతంలో సివిల్ వర్క్స్ విపరీతంగా చేశారు. స్వామి డబ్బులంతా సివిల్ వర్క్స్ కోసం వెళ్లిపోతున్నాయి. ముందు అవసల్ని ఆపేయాలి. ఉన్న భవనాలను కూల్చేసి కొత్తవి కట్టడం అవసరమా? టీటీడీకి వచ్చే ఆదాయంలో ఒక శాతం తిరుపతి మున్సిపాలిటీకి ఇవ్వాలంట. ఎందుకు ఇవ్వాలి? ఇవన్నీ రానున్న బోర్డులో చర్చిస్తాం. దేవుడు సొమ్ము ఇలా దుర్వినియోగం అయితే ఎలా? వందల మైళ్ల నుంచి వచ్చి స్వామిని దర్శించుకుని వందో రెండొందలో హుండీలో వేస్తారు భక్తులు. కమీషన్ల కోసం వారి భక్తిని ఇలా దుబారా చేస్తే ఎలా. అందుకే తిరుమల నుంచి ప్రక్షాళన చేస్తామని సీఎంగారు చెప్పారు.

**? టూరిజం టికెట్ల కోటా రద్దు వెనుక కారణం.**

! రూ.300 టూరిజం టికెట్‌ను అధిక ధరకు విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. నేనే స్వయంగా రూ.3,300 పెట్టి కొనుగోలు చేశాను. విజిలెన్స్ వాళ్లకు చెప్పాను. వాళ్లు కూడా రూ.300 టికెట్‌ను రూ.3,300 కొన్నారు. దీంతో టూరిజం కోటానే రద్దు చేశాం. తిరుమలలోని కొన్ని దుకాణాల్లోనూ దర్శన టికెట్లు బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు తెలిసింది. దానిపై కూడా నిఘా పెట్టాం.



కాలేజీ రోజులను గుర్తు చేసుకున్నారు. నాటి సరదాలే కాదు.. చిన్న వయసులోనే పెళ్లయిన అమాయకత్వాన్ని, ఏమీ తెలియనితనం నుంచి భర్త చంద్రబాబు దన్నుతో హెరిటేజ్ సారథిగా సాధించిన విజయాలను తలపోశారు. అన్న బాలకృష్ణ డైలాగ్‌ను వల్లించారు. కుమారుడు లోకేశ్ బాల్యాన్ని, పెద్దయ్యాక ఆయనకు చేసిన ఉద్బోధను ఏకరువు పెట్టారు. మొత్తంమీద నారా భువనేశ్వరి చిత్తూరు జిల్లా కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మమేకమై వారిలో ఒకరిగా మారిపోయారు. విద్యార్థులతో ముఖాముఖి సందర్భంగా ఇచ్చిన సమాధానాలలో కాసేపు సరదాగా, కాసేపు సీరియస్‌గా, ఇంకాసేపు గంభీరంగా ఆమె చాలా అంశాలు ప్రస్తావించారు.

- కుప్పం, ఆంధ్రజ్యోతి

# సరదా సరదాగా..!

## విద్యార్థులతో మమేకమైన నారా భువనేశ్వరి

- మిమ్మల్ని చూస్తుంటే నాకు నా కాలేజ్ డేస్ గుర్తుకొస్తున్నాయి. నేనూ మీలాగే సరదాగా ఉండేదాన్ని. కానీ చదువుకుంటుండగానే నాకు చంద్రబాబుతో పెళ్లయిపోయింది. ఆ వయసులో నాకు ఏమీ తెలియదు. అయినా నామీద నమ్మకంతో నా భర్త చంద్రబాబు హెరిటేజ్ ఎండీని చేశారు. ఛాలెంజ్‌గా తీసుకుని పనిచేశా. ఇప్పుడీ స్థితికి చేరుకున్నా. ఎవరైనా సరే, కష్టపడనిదే విజయం ఊరికే రాదు.
- నా హీరో చంద్రబాబు. ఆయన విజనరీ నాకు ఆదర్శం. భార్యాభర్తల్లో ఎవరైనా ఎదగాలంటే ఎవరో ఒకరు త్యాగం చేయాలి తప్పనిసరిగా. ఆయన నాకిచ్చే సమయం ఉదయం 8.30 గంటలకు. తర్వాత ఆయన తన బాధ్యతల్లో మునిగిపోతారు. ఏదైనా అవసరమై ఫోన్ చేయాలన్నా, పీఏకి చేయాల్సిందే. ఆయన ఫోన్ ఎత్తరు.
- నేను లోకేశ్ విషయంలో చాలా స్ట్రిక్ట్. నన్ను హిట్లర్ అని పిలిచేవాడు. తన స్నేహితులకు కూడా అలాగే చెప్పేవాడు. చంద్రబాబు రాష్ట్రంకోసం, ప్రజలకోసం పనిచేస్తుంటే సింగిల్ మదర్‌గా పెంచానేమో, లోకేశ్‌ను చాలా క్రమశిక్షణలో పెట్టేదాన్ని.
- నాడు, నేడు రాజకీయాల్లో ఒక తేడా ప్రధానంగా కనిపిస్తోంది. ఒకప్పుడు లీడర్‌కు అనుచరులు పూర్తి విశ్వాసంగా ఉండేవారు . నేడు ఆ విశ్వాసం, బాధ్యత తగ్గిందనిపిస్తోంది. లోకేశ్ బాబు ప్రజలకు న్యాయం చేస్తాడు. నేను హామీ ఇస్తున్నా.
- నేను సినిమాలు చాలా తక్కువ చూస్తా. బాలయ్య మూవీలో ఏది నచ్చిందంటే చెప్పలేను. చూసినంతలో సమరసింహారెడ్డి నచ్చిందని చెప్పవచ్చు. డైలాగ్స్ నాకు రావు. అయినా వచ్చినంత చెబుతాను. ఒకేవైపు చూడు, మరోవైపు చూడబాక అనే డైలాగ్. ఏ విషయంలోనైనా ఫోకస్‌గా ఉండాలి. అప్పుడు విజయం వరిస్తుంది. అదే ఈ డైలాగ్‌లో చెప్పారేమో.
- నేను హైలెవల్ పర్ఫెక్షనిస్ట్‌గా ఉండాలనుకుంటా. అంటే ఏ చిన్న లోపమూ కనిపించకూడదు. ఈ క్రమంలో చాలా అలసిపోతా. ధ్యానం నా స్ట్రెస్ బస్టర్. ఉదయం, సాయంత్రం మెడిటేషన్ చేస్తా. ఇంకా మనవడున్నాడు నాకు. వాడితో టైం స్పెండ్ చేస్తే కూడా ఒత్తిడి తగ్గిపోతుంది. వాడికి అయిదు సంవత్సరాలు వచ్చేవరకు నా మాట వినేవాడు. ఇప్పుడు నేను ఏం చెప్పినా వినడం లేదు. నాతో ఫైటింగ్ ఎక్కువ. ఎందుకొచ్చిన గొడవని వాడి మాట వినడం అలవాటు చేసుకున్నా.
- నాకు మ్యాథ్స్ ఇష్టం లేదు. హిస్టరీ ఇష్టం. చంద్రబాబు ఎకనామిక్స్ పీజీ చేశారు. ఆ సబ్జెక్టు కూడా ఇష్టం లేదు. చాలా డ్రై సబ్జెక్టు. ఆయన ఎలా మ్యానేజ్ చేశారో.
- నాకు మొదట్లో కుక్స్ లేరు. నేనే వంట చేసేదాన్ని, డ్రైవింగ్ కూడా నేనే. మా ఆయనకు డబ్బులు సేవ్ చేసేదాన్ని. ఇప్పటికి కూడా నేను 20-30 మందికి వంటచేసి వడ్డించగలను. అయితే లోకేశ్ చిన్నప్పుడు నామీద ఒకటే కంప్లయింట్ చేసేవాడు. ఎవరైనా అడిగితే మా అమ్మ ఏమీ చేయలేదు. ఒట్టి రసమన్నం పెడుతుంది అనేవాడు. నేను ఇల్లు ఊడుస్తుంటే బెడ్ కిందనుంచి బర్గర్ల బాక్స్‌లు బయటపడేవి. వాడికి బర్గర్లు, స్నాక్స్ అంటే అప్పట్లో చాలా ఇష్టం. ఫ్రెండ్స్‌తో తెప్పించుకునేవాడేమో.ఇప్పటికీ లోకేశ్‌తో ఆ విషయం గురించి చెప్పి, నవ్విస్తుంటా.
- నాకు బహుమతుల మీద ఆశలేదు. ఆయనను ఎప్పుడూ వాటిని గురించి అడగను. అయితే మా ఫ్రెండ్ హజ్బెండ్ ఒకరు మ్యారేజ్ యానివర్శరీకి ఆవిడకు డైమండ్ రింగ్ కొని ప్రజంట్ చేశారట. నాకు చెప్పింది. నేను కూడా మా యానివర్శరీకి డైమండ్ రింగ్ కొనమని అడిగాను. నువ్వే ఒక డైమండ్, నీకు ఇంకా వేరే డైమండ్ ఎందుకన్నారు. అలా చాకచక్యంగా తప్పించుకున్నారన్న మాట. అంతే, అప్పటి నుంచి నేను ఆయననుంచి ఏ బహుమతులూ కోరలేదు.



## కుటుంబ కలహాలతో మహిళ హత్య

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలు మహిళ హత్యకు దారితీశాయి. ఈ ఘటన గురువారం తిరుపతి నగరంలో చోటుచేసుకుంది. అలిపిరి ఎస్‌ఐ నాగార్జున రెడ్డి కథనం మేరకు.. సింగాలగుంటకు చెందిన ద్రాక్షాయణి నాలుగు ఇళ్లలో పాచి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఆమె కుమారుడు పురుషోత్తం, కోడలు నాగలక్ష్మి భవానీనగర్‌లో కాపురముంటున్నారు. కొన్ని రోజులుగా వీరిద్దరూ తరచూ గొడవ పడుతున్నారు. బుధవారం రాత్రి భర్త గొడవపడుతుండడంతో నాగలక్ష్మి తన సోదరుడు విజయ్‌కు విషయం చెప్పింది. తల్లి మాటలు వినడం వల్లే పురుషోత్తం తన చెల్లితో గొడవపడుతున్నాడని భావించిన విజయ్ శింగాలగుంటకు వెళ్లి ద్రాక్షాయణిని కత్తితో నరికాడు. రక్తపు మడుగులో పడిపోయిన ఆమెను స్థానికులు దగ్గర్లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. అలిపిరి ఎస్‌ఐ నాగార్జున రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు విజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు.



మృతి చెందిన ద్రాక్షాయణి

## అన్న మృతిపై తమ్ముడి అనుమానం

- ఖననం చేసిన మృతదేహానికి ఆరు నెలల తర్వాత పోస్టుమార్టం

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): అన్న మృతిపై అనుమానాలు ఉన్నాయని తమ్ముడు ఫిర్యాదు చేశాడు. దీంతో ఖననం చేసిన మృతదేహానికి ఆరు నెలలకు పోస్టుమార్టం నిర్వహించారు. తొట్టంబేడు మండలం దొంగలముదూరు గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్(40).. బీఎన్‌కండ్రిగ మండలం పల్లమాల గ్రామ చెరువు దగ్గర జూన్ 21న మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో క్రైస్తవ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈ క్రమంలో ఉదయ్‌కుమార్ మృతిపై తమ్ముడు భానుప్రసాద్‌కు అనుమానం కలిగింది. హత్య చేసి ఉంటారని భావించి గురువారం బీఎన్‌కండ్రిగ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ విశ్వనాథనాయుడు.. దొంగలముదూరు గ్రామానికి చేరుకున్నారు. తహసీల్దార్ మధుసూదన్ రావు సమక్షంలో మృతదేహానికి డాక్టర్లు హరిత, జ్యోతిప్రసూన పోస్టుమార్టం నిర్వహించారు.

## ఎల్ఏ ఆర్ అండ్ ఆర్ అథారిటీ న్యాయవాదిగా ఆదినారాయణ

తిరుపతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా పనిచేస్తున్న ల్యాండ్ అక్విజేషన్ రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్ అథారిటీకి ప్రభుత్వ న్యాయవాదిగా తిరుపతికి చెందిన శాకమూరి ఆదినారాయణ నియమితులయ్యారు. రాయలసీమ జిల్లాల పరిధిలో భూ సేకరణ వివాదాలకు సంబంధించిన కేసులు ఈ అథారిటీ ఎదుట విచారణకు వస్తుంటాయి. ఆ కేసుల్లో ప్రభుత్వ న్యాయవాదిగా ఆదినారాయణ వ్యవహరించనున్నారు. ఆయన సంబంధిత పదవిలో ఏడాది పాటు కొనసాగుతారని ప్రభుత్వం గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

## 25కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్టు

రేణిగుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రేణిగుంటలో 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని.. ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. రేణిగుంట అర్బన్ పోలీసుల కథనం మేరకు.. కొత్త చెక్‌పోస్టు సమీపంలో బుధవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని తనిఖీ చేశారు. వారి వద్ద 25 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించారు. గంజాయి విలువ రూ.2.5 లక్షలు ఉంటుంది. నిందితులు తారక రామానగర్‌కు చెందిన సక్కుబాయి, తిరుపతి సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన కట్టమంచి చిరంజీవిగా గుర్తించారు. వీరు విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి రేణిగుంట, తిరుపతి ప్రాంతాల్లో విక్రయిస్తుంటారని గుర్తించారు. కేసు నమోదు చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

# పుత్తూరు వార్తలు

## విద్యుత్‌ను పొదుపుగా వాడండి



పుత్తూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పొదుపుగా విద్యుత్‌ను వినియోగించాలని డీఈ ఆశీర్వాదం కోరారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక అంబేద్కర్ కూడలిలో విద్యుత్ శాఖాధి కారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ శంకరయ్య, ఏఈలు జయసాయి, రవికుమార్, ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను ప్రజలకు వివరించండి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు

నారాయణవనం, డిసెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలని నారాయణవనం జడ్పీటీసీ సుమన్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం పాలమంగళం దక్షిణంలో గ్రామ కమిటీ అధ్యక్షులు బీఎం నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కరన్, మురుగేషం, పరంధామరెడ్డి, సుధాకర్, సురేష్, దయ, నరేష్, రాజశేఖర్, పురుషోత్తం పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

పుత్తూరు టౌన్, డిసెంబర్ 19 (ఆంధ్ర జ్యోతి): సమస్యల సత్వర పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు అధ్యక్షతన రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య మాట్లాడుతూ పట్టణంలోని శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో ఒక వ్యక్తి కోసం భూ తగాదాలుగా చూపించడం వల్ల అక్కడివారు భూముల అమ్మకాలు, కొనుగోలు చేసుకోలేక పోతున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డీఎస్ ఎలుమలై, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగరెడ్డి, కరుణాకరన్, ఎంఎస్ శ్రీరాం, ఏలుమలై రెడ్డి, జనసేన పార్టీ నాయకులు మెరుపుల మహేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను అవమానించడం శోచనీయం



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పుత్తూరు టౌన్, డిసెంబర్ 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా అవమానించడం సరికాదని కేవీపీఎస్, డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ జిల్లా నాయకులు వెంకటేష్, డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు మహేష్, నాయకులు విజయ్, యాసిన్‌బాష, కృష్ణమూర్తి, హరీష్, గోవిందస్వామి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తుకు భరోసాగా టీడీపీ సభ్యత్వం



వడమాలపేట, డిసెంబర్ 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం భవిష్యత్తుకు భరోసానిస్తుందని జిల్లా బీసీ సాధికార కమిటీ ఉపాధ్యక్షులు మునిరత్నం చెప్పారు. గురువారం పత్తిపుత్తూరులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, నాయకులు మురళీకృష్ణ, కాటయ్య, లంబోదరం, నాగరాజు, వెంకటముని, పవన్, మునిప్రసాద్ పాల్గొన్నారు.

## గూళూరు చెరువు తూములను బాగుచేయండి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

వడమాలపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గూళూరు చెరువు తూములు బాగుచేసి గ్రామాన్ని కాపాడాలని ఎస్‌బీఆర్‌పురం గ్రామస్తులు విన్నవించారు. గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు తహసీల్దార్ జరీనాకు వినతిపత్రం అందించారు. గ్రామంలోకి నీళ్లు వచ్చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు నీళ్లను తూముల ద్వారా దిగువకు నీటిని వదలి గ్రామాన్ని రక్షించాలని కోరారు. ఈ సదస్సులో ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులు, సర్పంచ్ మణిరాజు, ధనంజయులు నాయుడు, పెద్దబ్బరాజు, సుబ్రమణ్యం యాదవ్, శ్యామయ్య, రవి పాల్గొన్నారు.

## ఐదుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



పుత్తూరు అర్బన్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 19: ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేతుల మీదుగా ఐదుగురికి సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో పలువురు ఆస్పత్రి వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి విజ్ఞప్తులు అందించారు. ఈ క్రమంలో ఐదుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1,81,433ల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

# గూడూరు
### సూళ్లూరుపేట/వెంకటగిరి

## ముందస్తు క్రిస్మస్ వేడుకలు



ప్రీ క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు

నాయుడుపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బేరిపేటలోని లూథరన్ చర్చిలో గురువారం సండే స్కూల్ విద్యార్థులచే ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. పొరుగువారిని ప్రేమించాలన్నదే ఏసుక్రీస్తు అభిమతమని బిషప్ మైకెల్ బెన్‌హర్ తెలిపారు. పిల్లలు దేవదూతలుగా, గొర్రె కాపరులుగా, శాంతాక్లాజ్ తదితర వేషధారణలలో అలరించారు. కార్యక్రమంలో సండే స్కూల్ సూపరింటెండెంట్ కె. ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ క్యాడెట్‌కు అభినందనలు



ఎన్‌సీసీ క్యాడెట్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎన్‌సీసీ క్యాడెట్ చంద్రమోహన్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు. ఈనెల 21 నుంచి కేరళలోని ఇడుక్కి జిల్లాలోని మరయూర్ అడవుల్లో జరిగే క్యాంపునకు కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ చంద్రమోహన్ ఎంపికయ్యారు. ఎన్‌సీసీ అధికారి మాధవయ్య, డాక్టర్ విక్రమ్‌కుమార్‌లు జ్ఞాపికలు అందించి అభినందించారు.

# పడకేసిన పారిశుధ్యం..!

- రొచ్చుగా మారిన మైలాంగంలోని వీధులు
- మురుగు నీటి నిల్వలతో రోగాల బారిన గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు



మైలాంగం గ్రామంలో ప్రధాన రహదారిలో రొచ్చు



ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న పేడదిబ్బలు, రోడ్డుపై మురుగు

దొరవారిసత్రం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లుగా మండల రాజకీయాలను శాసిస్తున్న ముఖ్య నాయకుల స్వగ్రామం అది... ఆ గ్రామం నుంచే మండల జడ్పీటీసీ, మండల అధ్యక్షులు పదవులు అనుభవిస్తున్నారు. అయితే ఆ ఊరిలో అడుగు వేయలేని పరిస్థితి. ఆ ఊరి నడుబొడ్డున ప్రధాన రహదారిపై మురుగునీటి నిల్వలతో అవస్థలు పడుతున్నారు. ఇదీ దొరవారిసత్రం మండలంలోని మైలాంగం పరిస్థితి. కురిసిన వర్షాలకు గ్రామంలోని రోడ్లు బురదమయంగా మారాయి. గ్రామం నడిబొడ్డున నేలపట్టు -కలగుంట రహదారిపై కాలు వేయలేని పరిస్థితి. పాదచారులు నడవాలంటే నరకమే. గ్రామం ప్రారంభం నుంచి చివరి వరకు రహదారి అంతా రొచ్చుగా మారింది. రహదారికి ఎగువ భాగంలోని నీటి గుంట నుంచి రహదారిపైకి, ఇళ్ల ముంగిటకు నీరు చేరుతుంది. దీనికి తోడు వర్షపు నీరు నిల్వ చేరడంతో రోడ్డంతా అస్తవ్యస్తంగా మారింది. రహదారికి ఆనుకొని పేడదిబ్బలు ఉండటంతో మరింత దారుణంగా మారుతోంది. నీటి నిల్వలు, దోమల వృద్ధితో గ్రామస్థులు రోగాల బారిన పడుతూ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. మైలాంగంలోని తాగునీటి బోరు చుట్టూ పేడ దిబ్బలు, మురుగు నీటి కుంటలు ఉన్నాయి. దీంతో తాగునీరు కలుషితం అయ్యే అవకాశాలు ఉండటంతో గ్రామస్థులు ఆందోళనలో పడ్డారు. అయితే పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదే మార్గంలోనే రోజూ ఉద్యోగులు, నాయకులు తిరుగుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## సమష్టి సహకారంతోనే గ్రామీణాభివృద్ధి





అధికారులతో సర్పంచులు, సిబ్బంది

తడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమష్టి సహకారంతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని, శిక్షణను సద్వినియోగం చేసుకొని ప్రతిఒక్కరూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ కొలవి రఘురెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో విజయకుమార్, ఈటీసీ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్, ఏపీవో రాజారెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● దొరవారిసత్రం: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజులుగా జరిగిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. గ్రామాల్లో పేదరిక నిర్మూలన, అందరికీ ఆరోగ్యం, స్వచ్ఛమైన తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, సుస్థిరమైన నగర రూపకల్పనపై సర్పంచులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ అందించారు. ఎంపీడీవో గోవర్ధన్, ఏఈపీఆర్ వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షణాధికారి రఘురామయ్య, సచివాలయ సిబ్బంది, సర్పంచులు పాల్గొన్నారు.

## అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి



అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో వ్యంగ్యంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేసి బహిరంగ క్షమాపణ చెప్పాలని గురువారం కోటలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, బహుజన ఐక్యవేదిక నాయకులు నిరసన తెలిపారు. అమిత్‌షా దిష్టిబొమ్మను ఆర్టీసీ సెంటర్‌లో తగులబెట్టి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్టీసీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మీజూరు మాధవ్, పసల చిరంజీవి, అశోక్ కాంబ్లే, ఏడుకొండలు, బహుజన ఐక్యవేదిక నాయకులు దాసరి సుందరం, గంగయ్య, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

● సూళ్లూరుపేట: కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని వామపక్షాలు డిమాండు చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వామపక్ష నాయకులు అల్లెయ్య, రియాజ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

● వెంకటగిరి టౌన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు జరిగిన అవమానాన్ని నిరసిస్తూ స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సీఐటీయూ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, సీఐటీయూ పెంచలయ్య, సుబ్బరామయ్య, నాగమణి, గీత, ధనలక్ష్మి, భాస్కర్, కేవీపీఎస్ రమణయ్య, గిరిజన సంఘం నాయకులు కృష్ణయ్య పాల్గొన్నారు.

● గూడూరు అర్బన్: కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా కేవీపీఎస్ నాయకులు స్థానిక టవర్ క్లాక్ కేంద్రం వద్ద కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రసాద్, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రమణయ్య, సురేష్, శివకుమార్, శ్రీనివాసులు, రమణయ్య పాల్గొన్నారు.

## పుష్కలంగా సాగునీరు

● ప్రమాదకరంగా 12 చెరువులు



నిండిన చంద్రశేఖరపురం చెరువు

కోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది కురిసిన వర్షాలకు మండలంలోని 35 నీటి పారుదల శాఖ చెరువులకు వర్షపు నీరు నిల్వచేరింది. గత ఏడాదిని పోల్చుకుంటే ఈ ఏడాది చివరిలో అల్పపీడనాలతో ఆశించినంత వర్షాలు కురుస్తుండటంతో అన్ని చెరువులు పూర్తిగా నిండాయి. ఈ ఏడాది వరి సాగుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ప్రధానమైన 7 వేల ఎకరాల ఆయకట్టు కలిగిన పెన్నక్క చెరువులోనూ నీరు చేరుతుండటంతో స్థానిక ఆయకట్టు రైతులు ఆనందాలకు అవధుల్లేవు. మండల పరిధిలోని కొండుగుంట, రాఘవాపురం, మద్దాలి, కేశవరం, చిట్టేడులోని 3 చెరువులు, ఊనుగుంటపాళెం, చంద్రశేఖరపురం, ఉత్తమనెల్లూరు, కోట చెరువులకు వర్షపునీరు నిల్వ చేరింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గతంలో మరమ్మతులు చేయని కారణంగా తెగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. వంజివాక, పుచ్చలపల్లి, చిట్టేడు తాటిచెరువు, ఉత్తమనెల్లూరు చెరువులకు గతంలో మరమ్మతులు జరగకపోవడంతో వర్షాలు తీవ్రతరం అయితే చెరువులు తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఎక్కువైతే 12 చెరువులు ప్రమాదపు అంచుల్లో ఉన్నాయి. అధికారులు స్పందించి ప్రమాదకర చెరువులను పరిశీలించి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# చల్లా బాబుకు పలువురి శుభాకాంక్షలు



రొంపిచెర్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లెలో పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి మంగాపురంలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని రొంపిచెర్ల మండలానికి ఆయన రాగానే టీడీపీ శ్రేణులు హారతులు పట్టి, మంగళవాయిద్యాలతో స్వాగతించారు.చల్లా ఇంటికి వచ్చిన పలువురు అధికారులు ఆయనకు పూలమాలలు వేసి, దుశ్శాలువాలు కప్పి సత్కరించారు.చల్లా బాబు తన తల్లి, మాజీ ఎంపీపీ ప్రేమలతమ్మ, భార్య , మాజీ సర్పంచ్ చల్లా సుప్రియారెడ్డి, కుమార్తె పూజారెడ్డి, టీడీపీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు.మండల టీడీపీ అధ్యక్షుడు, కురబకుల కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఓబులేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ రవికుమార్ నాయుడు, మాజీ ఎంపీటీసీ బీఅమరనాథరెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ అమరనాథరెడ్డి, నాయకులు శ్రీనివాసులు నాయుడు, అబ్బారెడ్డి విజయ్, వి.మదనమోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు సహదేవ, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు గూడూరు హరిబాబు, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, శేషాద్రి నాయుడు, జేసీబీ బాబురెడ్డి, కిరణ్‌కుమార్, సిద్దయ్య, ఉయ్యాలశశి, వల్లిపోగు వెంకట్రమణ, పొన్నం వెంకట్రమణ, మేడసాని రవికుమార్ నాయుడు, నరిన్, గోవర్ధన్‌రెడ్డి, ఆంజనేయులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## నేడు కంటి వైద్య శిబిరం

వెంకటగిరి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీ శ్రీనివాసన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బంగారుపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఆ సంస్థ క్లస్టర్ ఇన్‌చార్జి జయసింగ్ గురువారం తెలిపారు. తిరుపతి అరవింద ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

## అద్దెకు ఆర్టీసీ బస్సులు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఆర్టీసీ డిపోలో అద్దెకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని ఆర్టీసీ డీఎం రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అహోబిలం నరసింహ క్షేత్రం, అన్నవరం సత్యనారాయణ స్వామి, కదిరి నరసింహ క్షేత్రం, ఉడిపి, శ్రీరంగం మొదలగు క్షేత్రాలకు బస్సులు అద్దెకు పంపనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 99592 25647, 73828 86789, 73828 87743, 93815 39535లను సంప్రదించాలని కోరారు.

## వెందోడులో ‘పొలం పిలుస్తోంది’

గూడూరు అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంద్ర, వెందోడు గ్రామాల్లో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రమేష్ మాట్లాడుతూ రైతులకు పంటల సాగుపై పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో చక్రి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ చంద్రయ్య (45) మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. మండలంలోని బిలమత్తూరు గ్రామానికి చెందిన చంద్రయ్య ఆటో నడుపుకుంటూ కాపులూరుకు వెళ్లి తిరిగి నాయుడుపేటకు వస్తుండగా ఈనెల 17న అయ్యప్పరెడ్డిపాళెంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. గాయపడిన చంద్రయ్య నెల్లూరులో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

## దేశాభివృద్ధే యువతకు లక్ష్యం కావాలి



గూడూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దేశాభివృద్ధే యువతకు లక్ష్యం కావాలని ఇన్సాఫ్ కమిటీ ప్రతినిధి జమాలుల్లా అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ, ఇన్సాఫ్ కమిటీల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్ ల వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్, కాలేషా, శశికుమార్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## భగవద్గీత శ్లోకాలపై పోటీలు



భగవద్గీత శ్లోకాలను వివరిస్తున్న విద్యార్థి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాష్యం పాఠశాలలో విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు పండితులు సుంకర రవి మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. 50 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుకన్య , అవ్వారు శ్రీనివాసులు, చల్లా గంగేశ్వరరావు, చేబ్రోలు రవీంద్ర పాల్గొన్నారు.

## సీపీఐ పటిష్టతకు కలిసికట్టుగా కృషి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గూడూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పటిష్టతకు అందరూ కలిసికట్టుగాపనిచేద్దామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ పార్టీ పనిచేస్తుందన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శశికుమార్, కాలేషా, రమణయ్య చంద్రయ్య, నారాయణ, శ్రీనివాసమూర్తి, జమాలుల్లా, మస్తానయ్య భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థికి అభినందనలు



శైలేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శేషవర్ధన్ తదితరులు

కోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిట్టేడు గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న శైలేష్ స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో కబడ్డీ విభాగంలో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ శేషవర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పీడీ సత్యనారాయణ ప్రశంసాపత్రాలు, షీల్డ్‌లతో అభినందించారు. ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు హర్యానాలోని బివానీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా పోటీలు జరిగాయి. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున నెల్లూరు జిల్లా నుంచి ఇక్కడ గిరిజన గురుకులం విద్యార్థి శైలేష్ పాల్గొని ప్రతిభ చూపాడు.

# శ్రీకాళహస్తి
## సత్యవేడు

## రైల్వే విశ్రాంత ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాగరం శ్రీధర్

రేణిగుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైల్వే విశ్రాంత ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సాగరం శ్రీధర్ డిమాండ్ చేశారు. స్థానిక రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాల యంలో గురువారం విశ్రాంత ఉద్యోగ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే విశ్రాంత ఉద్యోగుల నోషనల్ ఇంక్రిమెంట్లు, కమ్యూ టేషన్‌ను పది సంవత్సరాల ఎనిమిది నెలలకు నిలుపుదల చేసి ఎక్కువ మొత్తంలో వసూలు చేసిన నగదును తిరిగి చెల్లించాలన్నారు. పెన్షనర్లను ఇన్‌కమ్ ట్యాక్స్ పరిధి నుంచి విముక్తి కల్పించాలని కోరారు. పెన్షనర్లకు ఉద్యోగులతో సమానంగా హెచ్ఆర్ఏ ఇవ్వాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఎనిమిదో పే కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రైలు ప్రయాణంలో సీనియర్ సిటిజన్లలో పురుషులకు 40 శాతం, స్త్రీలకు 50 శాతం రాయితీలను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రేణిగుంట డివిజన్ అధ్యక్షులు సాహెబ్, కార్యదర్శి జయంత్ కుమార్, ఉపాధ్య క్షులు రఘునాథరెడ్డి, సహాయ కార్యదర్శి రాజేంద్రన్, సభ్యులు వెంకటేశ్వర్లు, జ్ఞానశేఖర్, వెంకటరమణ, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజలకు శుభ్రమైన తాగునీరు అందించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

కేవీబీపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు శుభ్రమైన తాగునీటిని అందించాలని ఏఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో రెండవ రోజు గ్రామాల సుస్థిర అభివృద్ధి కార్య క్రమంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న వాటర్ ట్యాంకులను వారానికి ఒకసారి బ్లీచింగ్ వేసి శుభ్రం చేయాలన్నారు. తాగునీటి పైపులు లీకేజీలు లేకుండా చూడాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వీధుల్లో మురుగు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లుతుండాలన్నారు. చెత్తకుప్పలు, పేడ దిబ్బలను ఊరిబయటే ఏర్పాటు చేయాలన్నారు. వైద్యసిబ్బంది ఎప్పటికప్పుడు ప్రతి ఇంటినీ సందర్శించి ఎవరినా వ్యాధుల బారిన పడి ఉంటే వారికి చికిత్సలు అందించాలన్నారు. పన్ను వసూళ్లు పక్కాగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధారాణి, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, పలుశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణం పేరుతో ప్రభుత్వ భూముల కబ్జా



కాలువ పోరంబోకు భూమిలో నిర్మిస్తున్న ఆలయం,
ఆలయ సమీపంలో నిర్మించిన షెడ్డు, ఏర్పాటు చేసిన గడ్డివాము

రేణిగుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆలయ నిర్మాణం పేరుతో ప్రభుత్వ భూముల కబ్జా కొనసాగుతోంది. తూకివాకం పంచాయతీ పరిధిలో కలెక్టరేట్‌కు వెళ్లే రేణిగుంట - తిరుచానూరుకు ప్రధాన రహదారి అనుకుని పన్నీరుకాల్వ గ్రామానికి వెళ్లే మార్గంలో కబ్జా సాగుతోంది. ఇక్కడ సర్వేనంబరు 929లో ఒక ఎకరా 36 సెంట్ల కాల్వ పోరంబోకు భూమి ఉంది. ఈ విలువైన భూమిపై కబ్జారాయుళ్ల కన్ను పడింది. వెంటనే ఆలయ నిర్మాణం పేరుతో ఆ భూమిలో వాలిపోయారు. ఆలయ నిర్మాణం చేపట్టి ఒక షెడ్డును నిర్మించారు. అదేవిధంగా మరోవైపు గడ్డివామును ఏర్పాటు చేశారు. నెల రోజులుగా ఈ నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ విషయమై వీఆర్వోకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపి స్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి భూముల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## రెవెన్యూ సదస్సులను
# సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, డిసెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. మండలంలోని పెద్దఈటి పాకంలో గురువారం తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధి కారులకు ప్రజలు తమ భూ సమస్యలను అర్జీ రూపంలో అందిస్తే పరిష్కరిస్తారని వివరించారు. అనంతరం బాలికల గురుకుల పాఠ శాలను తనిఖీ చేశారు. మధ్యా హ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లను బాగుచేయించాలని అపోలో పరిశ్రమ ప్రతినిధి సాయి బాబాను కోరారు. త్వరలో పూర్తి చేస్తామని అపోలో ప్రతినిధి తెలియజేశారు. ఎంపీడీవో చంద్రశేఖర్, సీఐ శ్రీనివాసులు, ఎంఈవో రవి, ఎంపీటీసీలు టీడీఎస్ రెడ్డి, శెల్వి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్య కేసులో ఒకరి అరెస్టు

నాగలాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. నాగలాపురం సాయినగర్‌కు చెందిన శేఖర్ ఆరు నెలల క్రితం అప్పుల వేధింపులు తాళలేక తన ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నాగలాపురం ఎస్ఐ సునీల్ దర్యాప్తు మేరకు.. మృతుడు శేఖర్‌కు కుమ్మర వీధిలో నివాసముంటున్న భరత్ రూ.11 లక్షల నగదు వడ్డీకి అప్పు ఇచ్చాడు. ఇందుకోసం అతడి ఇంటిని రాయించుకున్నాడు. అయినా ఇంకా అప్పు ఇవ్వాలని భరత్ వేధించడంతో శేఖర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో భరత్‌ను పోలీసులు అరెస్ట్ చేసి పుత్తూరు కోర్టులో హాజరు పరిచారు. నిందితుడికి 15 రోజులు రిమాండ్ విధించారు.

### వేదోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేధో గురు దక్షిణామూర్తికి గురువారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ, వినాయక పూజ చేశారు. అభిషేకం చేశారు. స్వర్ణాభరణాలతో సుందరంగా అలంకరించారు. పలు హారతులు సమర్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

### శాస్త్రోక్తంగా సంకట చతుర్దశి పూజలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజంజీ వినాయకస్వామి ఆలయం వద్ద సంకట చతుర్దశిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రతి కుటుంబం గణపతిహోమం నిర్వహించుకునేలా సంకట చతుర్దశి నాడు చేసే హోమాన్ని ఆర్జిత సేవగా తీసుకు వచ్చారు. ఇందులో భాగంగా గురువారం అంజి అంజి గణపతి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కలశ స్థాపన పూజలు నిర్వహించి గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా చేశారు. అభిషేకం నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈవో బాపిరెడ్డి దంపతులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

### ముక్కంటి సేవలో ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

### ఎంపీ బీద మస్తాన్‌రావుకు ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ్యులుగా ఎన్నికైన బీద మస్తాన్ రావును న్యూఢిల్లీలో గురువారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరథాచారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సత్కరించి ముక్కంటి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

### చేనేతలకు అండగా ఉండాలి

**వరదయ్యపాళెం:** శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని గురువారం రాష్ట్ర దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ గుత్తి త్యాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. దేవాంగ కులస్థులకు, చేనేతలకు అండగా ఉండాలని కోరారు.

### వృద్ధాశ్రమం పేరుతో వసూళ్లపై అభ్యంతరం

శ్రీకాళహస్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమం పేరుతో వీధుల్లో సంచరిస్తూ కొందరు నగదు, వస్తువుల వసూలు చేయడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తిలోని జయరామారావువీధిలో గురువారం ఓ దంపతులు ఆటోలో ఇంటింటికీ వెళ్లి వృద్ధాశ్రమానికి నగదు, వస్తువులను వితరణ చేయాలని ప్రచారం చేశారు. స్థానికులు కొందరు వారిని వృద్ధాశ్రమం ఎక్కడ ఉంది. వసూలు చేసేందుకు ముందుగా ఎవరి నుంచి అనుమతి తీసుకున్నారంటూ నిలదీశారు. వారు సమాధానం చెప్పలేక నీళ్లు నమలారు.




కోనేటిమిట్ట దగ్గర వర్షానికి కుళ్లిపోయిన వరి, జంబుగోళం గ్రామంలో మునిగిపోయిన వరి, చిన్నాయగుంటలో పొలంలో మేట వేసిన రాళ్లు, ఇసుక

## వాన తగ్గినా.. నీటిలోనే వరి

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నాయగుంట, జంబుగోళం, కోనేటిమిట్ట, పూనలపల్లి గ్రామంలో వర్షాలు తగ్గిన వరి పంటలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. పంటలు కుళ్లిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మూడు గ్రామాలలో సుమారు 70 ఎకరాలలో ఇప్పటికీ నీళ్లలోనే వరి పైరు పూర్తిగా మునిగిపోయి ఉంది. ఐదు ఎకరాలలో కుళ్లిపోయి పనికి రాకుండా పోయింది. ప్రస్తుతం రెండు రోజులు నుంచి ముసురు వాన కురుస్తుండటంతో మరల వరదలు వస్తే పంటలు పూర్తి స్థాయిలో పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

## ప్రజల వద్దకే రెవెన్యూ యంత్రాంగం


ప్రజా సమస్యలను వింటున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): త్వరగా భూ సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా రెవెన్యూ యంత్రాంగాన్ని ప్రభుత్వం ప్రజల వద్దకు తీసుకువచ్చిందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. తొట్టంబేడు మండలం విరూపాక్షిపురంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 45 రోజులలోగా పరిష్కార సాధ్యమైన అన్ని సమస్యలను తీర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా రియల్ టైం గవర్నమెంట్ సొసైటీ పోర్టల్ ద్వారా సమస్యలపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు రాయలేని వారి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించిందని తెలిపారు. రెవెన్యూతో పాటు ఇతర సమస్యలపై అర్జీలు స్వీకరించాలని అధికారులకు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకో వాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశిం చారు. అనంతరం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లా డుతూ ఉచిత ఇసుక విధానాన్ని దుర్వినియోగం చేస్తున్న అక్రమార్కులకు కళ్లెం వేయాలని అధికార యంత్రాంగాన్ని కోరారు. గోకులం షెడ్లు అదనంగా నిర్మించడం, విరూపాక్షిపురం రోడ్డు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ద్వారా భూ కబ్జాలకు పాల్పడేవారికి జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూకబ్జాలపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో బానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

## ప్రాథమిక దశలో క్యాన్సర్‌ని గుర్తిస్తే నయం చేసుకోవచ్చు


రోగులను పరీక్షిస్తున్న వైద్య నిపుణులు

పిచ్చాటూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలో క్యాన్సర్ వ్యాధిని గుర్తించ గలిగితే సులభంగా నయం చేసుకోవచ్చని ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రెడ్డికుమారి తెలియ జేశారు. మండలంలోని అడవి కొడియం బేడులో గురువారం వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్ రీసెర్చ్ ట్రస్టు వారి సంయుక్త ఆధ్వర్యంలో నోటి, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బీపీ, షుగర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. సుమారు 100 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పైన పేర్కొన్న సమస్యలతో ఎవరైనా బాధపడుతున్నట్లయితే ట్రస్టు ఉచితంగా వైద్య సేవలను తిరుపతి అలిపిరి జూపార్క్ దగ్గర ఉన్న టాటా క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు కేవీ.భాస్కర్ నాయుడు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, టాటా ట్రస్టు, ఎస్‌వీఐ క్యాన్సర్ కేర్, వైద్య బృందం పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనం తనిఖీ

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నాయగుంట ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ సుబ్రమణ్యం గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని వంట నిర్వాహకులు, ఉపాధ్యాయులకు సూచించారు.

### పిల్లలను పనుల్లో పెట్టుకోరాదు


తండ్రులకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మైనర్లతో పనులు చేయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ విశ్వనాథ నాయుడు హెచ్చరిం చారు. తంగేళ్లపురం గిరిజన కాలనీకి చెందిన పోలయ్య కుమారుడు చెంచుకృష్ణయ్య(15), పెద్దపాలేడు గ్రామానికి చెందిన శీనయ్య కుమారుడు వెంకటేష్(17) మండల కేంద్రంలోని దుకాణాలలో పని చేస్తుండగా వారిని స్టేషన్‌కు తరలించారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలలతో పనిచేయించరాదని చదివించాలని సూచించారు.

## వైభవంగా శ్రీవాణి ద్వితీయ వార్షికోత్సవం


మాట్లాడుతున్న ఎస్వీ రామారావు

శ్రీసిటీ, డిసెంబరు 19: శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు గురువారం శ్రీసిటీలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బిజినెస్ సెంటర్‌లో ప్రముఖ సినీ చరిత్రకారుడు, సినీ విజ్ఞాన విశారద అవార్డు గ్రహీత ఎస్వీ రామారావు నిర్వహించిన 'సినీ సాహిత్యంలో పౌరాణిక ప్రభావం' కార్యక్రమం సంగీత, సాహిత్య ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. అతిథులకు సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి శ్రీవాణి ద్వారా ఏడాదిగా నిర్వహిస్తున్న వివిధ భక్తిమయ, సంగీత, సాహిత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయడంలో శ్రీవాణి చేస్తున్న కృషిని వివరించారు. ఎస్వీ రామారావు మాట్లాడుతూ తెలుగు పౌరాణిక చిత్రాల అపూర్వ వారసత్వాన్ని వివరించారు. రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాల ఆధారంగా రూపొందించిన ఈ సినిమాలు అద్భుతమైన దృశ్యాలు, ఆధ్యాత్మిక కథనాలు, కవితాత్మక కథనాలతో ప్రసిద్ధి చెందాయని వివరించారు. సముద్రాల, సముద్రాల జూనియర్, మల్లాది రామకృష్ణ శాస్త్రి, పింగళి నాగేంద్రరావు, సదాశివ బ్రహ్మం, దేవులపల్లి, ఆరుద్ర, సినారె వంటి గీత రచయితల సృజనాత్మకతను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, మాజీ వైస్ చాన్స్‌లర్ కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని శ్రీసిటీ పీఆర్వో పల్లేటి బాలాజీ పర్యవేక్షించారు.

### రెవెన్యూ సదస్సుకు 18 వినతులు



బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నాయ గుంటలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో 18అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాష్ నాయుడు, టీడీపీ నాయకులు మధునాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు రామగిరిలో రెవెన్యూ సదస్సు

పిచ్చాటూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరిలో శుక్రవారం జరిగే రెవెన్యూ సదస్సుకు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

### కొత్తపాళెం రెవెన్యూ సదస్సుకు 11 వినతులు

రేణిగుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాళెం గ్రామంలో గురువారం తహసీల్దారు సురేష్‌బాబు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 11 దరఖాస్తులు అందాయి. ఆర్ఐలు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### మహాశివరాత్రి ఉత్సవాలపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఈవో బాపిరెడ్డి

శ్రీకాళహస్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్స వాలపై అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఆలయ ఈవో బాపిరెడ్డి గురువారం పరిపాలన భవనంలో పలు విభాగాల అధికారులతో ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. ఫిబ్రవరి 20 నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి ఉత్సవాలకు నెలరోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ గోపురాలకు రంగులు, విద్యుత్ అలంకరణలు, పూల అలంకరణలు, క్యూలైన్ల ఏర్పాట్లు, భక్తులకు అవసరమైన వసతులు, సాంస్కృతిక కార్యక్రమాలకు అతిథులను ఆహ్వానించడం, గోడపత్రికలు, ఆహ్వానపత్రికలు సిద్ధం చేయడం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు.

### సిపాయి భరోసా పంపిణీ


గోపాల్‌రెడ్డి కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి

ఏర్పేడు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం కృష్ణంపల్లి గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి అనారోగ్యంతో పది రోజుల క్రితం మృతిచెందారు. ఆయనకు గురువారం కర్మక్రియలు జరిగాయి. ఈ కర్మక్రియలకు ఎమ్మెల్సీ సిపాయిసుబ్రహ్మణ్యం హాజరయ్యారు. గోపాల్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు సిపాయి భరోసా కింద 41 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీప్రసాద్‌రెడ్డి, భరత్‌రెడ్డి, రత్నంరెడ్డి, సర్పంచ్ రాజేశ్వరి, వైసీపీ నాయకులు పెంచలరెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి, గెరటారెడ్డి, మునిరామిరెడ్డి, అశోకయ్య, చెంగయ్య, మురగారెడ్డి, అంకయ్య, చెంగల్రాయులు తదితరులు పాల్గొన్నారు.

# హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

శ్రీకాళహస్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు బాధాకరమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కరీముల్లా, ఆంటోని, మునిరాజా, ఖాదర్‌బాషా, కలీం, నజీబుల్లా, మస్తాన్, చందు, బద్రి పాల్గొన్నారు. కాగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలోనూ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన జరిగింది. ఈ కార్యక్రమంలో జనమాల గురవయ్య, గంధం మణి, అంగేరి పుల్లయ్య, రాపూరు సుబ్రహ్మణ్యం, చందమామల కోటయ్య, కుమార్, చారుశీల, రెడ్డ గోపి, షరీఫ్, లాలు, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

**కేవీబీపురం:** కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు కార్యాలయం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకరయ్య, రత్నమ్మ, సురేష్, మురగయ్య, నాగరాజు పాల్గొన్నారు.

**రేణిగుంట:** అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని దళిత సంఘాలు స్థానిక గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు గురువారం ప్రదర్శన నిర్వహించారు.

**పిచ్చాటూరు:** కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన పదవికి వెంటనే బేషరతుగా రాజీనామా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

**నాగలాపురం:** అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్ షా తక్షణమే తన పదవికి రాజీనామా చేసి భారత దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని నాగలాపురం కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. నాగలాపురంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ మండలాధ్యక్షుడు మురుగేషన్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి దినమని, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

**ఏర్పేడు:** కందాడులో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఏర్పేడులో దళిత సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.




శ్రీకాళహస్తిలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, కేవీబీపురంలో కేవీపీఎస్ నాయకులు నిరసన, రేణిగుంటలో అంబేడ్కర్ విగ్రహం ముందు దళిత సంఘాల నిరసన